రాజ్యాంగ ఉల్లంఘనపైనే సమీక్ష

- 370వ అధికరణ రద్దుపై సుప్రీం

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 18 | విజయవాడ, శుక్రవారం 18 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50


Vol No | Vijayawada, Friday 18 August 2023 | Rs



తిరుమలలో చిక్కిన మరో చిరుత

- ట్రోల్స్‌ను ఖండించిన టిటిడి ఛైర్మన్

లోపలి పేజీలో..



చంద్రయాన్-3లో మరో కీలక ఘట్టం సక్సెస్..

మాడ్యూల్ నుంచి విడివడిన ల్యాండర్

బెంగళూరు: ఇస్రో ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్-3లో మరో కీలక ఘట్టం విజయవంతంగా ముగిసింది. అంతరిక్ష నౌకలోని ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్ 'విక్రమ్' విజయవంతంగా విడిపోయినట్లు ఇస్రో గురువారం ప్రకటించింది. ఇప్పుడు అవి వాటి విడి ప్రయాణాలను ప్రారంభించాయి. ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విడిపోయిన తర్వాత ల్యాండ్ మాడ్యూల్ పంపిన సందేశాన్ని బెంగళూరులోని ఐఎస్‌టిఆర్ఎసి కేంద్రం అందుకుంది. 'థ్యాంక్స్ ఫర్ ది రైడ్, మేట్' అని ల్యాండర్ నుంచి మెసేజ్ వచ్చినట్లు ఇస్రో ట్విట్టర్‌లో పేర్కొంది. ఈ ప్రక్రియ పూర్తవడంతో ల్యాండర్ మాడ్యూల్ చందమామను సొంతంగా చుట్టేస్తుంది. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు డి-ఆర్బిట్-1 ప్రక్రియ చేపట్టనున్నట్లు, ఆ తర్వాత ఈ నెల 20న మరోసారి డి-ఆర్బిట్-2 ప్రక్రియ చేపడతామని ఇస్రో ప్రకటించింది. ఈ ప్రక్రియలతో ల్యాండర్ వేగాన్ని క్రమంగా తగ్గిస్తారు. చివరిసారిగా బుధవారం నౌక కక్ష్య వేగాన్ని తగ్గించారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5.47 గంటల సమయంలో చంద్రుడి దక్షిణ ధ్రువం మీద ల్యాండయ్యే అవకాశముందని ఇస్రో తెలిపింది. ఆ తరువాత ల్యాండర్ నుంచి రోవర్ బయటకు వచ్చి చంద్రుడిపై పరిశోధనలు చేయనుంది. ఈ నెల 23న ల్యాండ్ కాని పక్షంలో మరో నెల రోజుల తర్వాత ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తామని పేర్కొంది. చంద్రుడి మీద ఒక రోజు అంటే అది భూమి మీద దాదాపు 29 రోజులకు సమానం. అంటే చంద్రుడి మీద ఒక పగలు అంటే దాదాపు 14 రోజులు ఉంటుంది. ఆ 14 రోజులు మాత్రమే అక్కడ సూర్యకాంతి లభిస్తుంది. అంటే ఆ 14 రోజులు మాత్రమే ల్యాండర్, రోవర్లకు కావాల్సిన సౌరశక్తి అందుతుంది. అందుకే చంద్రుడిపైకి పంపుతున్న ల్యాండర్, రోవర్ల జీవిత కాలం కేవలం 14 రోజులే అని ఇస్రో తెలిపింది. చంద్రయాన్ -3 మిషన్ ల్యాండర్‌కు భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయి పేరుపెట్టిన విషయం తెలిసిందే.

సత్తా చాటిన మహిళలు

- గ్రూప్-1 తుది ఫలితాల్లో మొదటి మూడు ర్యాంకులు వారికే
- త్వరలో గ్రూప్-1, 2 నోటిఫికేషన్లు : ఎపిపిఎస్‌సి ఛైర్మన్ సవాంగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ విడుదల చేశారు. వీటిలో మొదటి మూడు ర్యాంకులను అమ్మాయిలు కైవసం చేసుకున్నారు. మొత్తం 11 శాఖలకు సంబంధించి 111 పోస్టులకు 110 మందిని ఎంపిక చేసినట్లు సవాంగ్ చెప్పారు. విజయవాడలోని ఎపిపిఎస్‌సి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అభ్యర్థుల జాబితాను ఆయన విడుదల చేశారు. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బిఎ పొలిటికల్ సైన్స్ చదివిన భానుశ్రీ లక్ష్మి అన్నపూర్ణ ప్రత్యూష మొదటి ర్యాంకు సాధించారని తెలిపారు. జెఎన్‌టియు అనంతపూర్ నుంచి బిటెక్ చదివిన భూమిరెడ్డి పావని రెండవ ర్యాంకు, కంబాలకుంట లక్ష్మి ప్రసన్న మూడవ ర్యాంకు, కె ప్రవీణ్ కుమార్ రెడ్డి నాల్గవ ర్యాంకు పొందినట్లు తెలిపారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో బిఎ చదివిన భాను ప్రకాష్‌రెడ్డి ఐదో ర్యాంకు సాధించారని వివరించారు. స్పోర్ట్స్ కోటా నుంచి త్వరలో ఒకరిని ఎంపిక చేస్తామన్నారు . అత్యంత తక్కువ సమయంలో గ్రూప్ -1 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. తప్పుడు సర్టిఫికెట్లతో మోసం చేయడానికి ప్రయత్నించిన ఒక అభ్యర్థిపై మాల్ ప్రాక్టీస్ కింద కేసు నమోదు చేశామన్నారు. ఆయనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో గ్రూప్-1, 2 పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని వెల్లడించారు. గ్రూప్-2 సిలబస్‌లో మార్పులు చేయనున్నట్లు వివరించారు. మూడు పేపర్లుగా ఉన్న మెయిన్స్‌ను రెండు పేపర్లుగా చేస్తామన్నారు. త్వరలో 2020 అసిస్టెంట్ పోస్టులు, 220 యూనివర్సిటీ జెఎల్ పోస్టులకు నియామకాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి కార్యదర్శి జె ప్రదీప్ కుమార్, సభ్యులు ఎస్ సలాంబాబు, పి సుధీర్, బిఎస్ సెలీనా, సివి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బిజెపిని సాగనంపితేనే మహిళలకు రక్ష

- అక్టోబరు 5న చలో ఢిల్లీ మార్చ్
- మహిళలు స్వేచ్ఛగా, హుందాగా జీవించే హక్కును నిరాకరిస్తున్న మోడీ సర్కార్
- ఐద్వా జాతీయ సదస్సులో వక్తలు

లోపలి పేజీలో..

నిస్తేజంగా ఖరీఫ్ సేద్యం

ఆగస్టు మూడవ వారం వచ్చినా సరైన వానల్లేవు

- 13 జిల్లాలు, 388 మండలాల్లో వర్షాభావం
- ప్రాజెక్టుల్లో నీటి కొరత
- ఇప్పటికి కావాల్సిన సాగులో 17.43 లక్షల ఎకరాలు మైనస్
- మెట్టసాగుకు దెబ్బ



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఆగస్టు రెండవ వారం గడిచాక కూడా ఈ మారు ఖరీఫ్ సాగు నిస్తేజంగానే ఉంది. నైరుతి రుతుపవనాలు ఆలస్యమయ్యాయి. రాష్ట్రంలోకి ప్రవేశించాక సైతం బలహీనంగా కొనసాగుతున్నాయి. ఎల్నినో ప్రభావమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆగస్టు 17కు చూసుకుంటే ఇప్పటికి పడాల్సిన వర్షంలో 23.5 శాతం తక్కువ పడింది. పదమూడు జిల్లాల్లో తక్కువ వర్షం నమోదైంది. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తక్కువ వర్షం కురిసింది. ఎపిలో సగానికిపైన భూభాగం వర్షాభావం కింద మగ్గుతోంది. జూన్ 1 నుంచి ఆగస్టు 17 వరకు సాధారణ సగటు వర్షపాతం 353.3 మిల్లీమీటర్లు కాగా 270.2 మిమీ నమోదైంది. రాష్ట్రంలో 679 మండలాలుండగా 388 మండలాలు వర్షాభావం కోరల్లో చిక్కాయి. వాటిల్లో 42 మండలాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఖరీఫ్ సీజన్‌లో రెండున్నర మాసాలు ముగిశాయి. పంటల సాగుకు ఇంకా నెలన్నర మాత్రమే సమయముంది. ఇప్పటికి సీజన్ నార్మల్‌లో సగమే సాగైంది. ఆగస్టు 16 నాటికి కావాల్సిన సాధారణ సాగులో దాదాపు పదిహేడున్నర లక్షల ఎకరాల మైనస్ నెలకొంది.

తీవ్ర డ్రైస్పెల్

వర్షాభావం వలన మెట్ట సేద్యం బాగా తగ్గింది. వేరుశనగ, ఇతర నూనెగింజలు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, చివరికి పత్తి సాగు సైతం ఈ తడవ తగ్గింది. వేరుశనగకు అదను ముగిసింది. ఆ పంట సాగు ఇక రైతులు చేపట్టరు. డెల్టా కాల్వలకు ముందుగా నీరు వదిలినప్పటికీ వరి నాట్లు మందకొడిగానే సాగుతున్నాయి. ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు నిరుటికంటే బాగా తక్కువున్నాయి. నాగార్జునసాగర్, శ్రీశైలం, సోమశిల ప్రాజెక్టులలో గతేడాదికి, ఇప్పటికి నీటి నిల్వలు సగానికి సగం తక్కువున్నాయి. నీటి నిల్వలు తగినంత లేనందున మూడేళ్లుగా మూతపెట్టిన పట్టిసీమ ఎత్తిపోతల నుంచి కృష్ణా డెల్టాకు నీరిచ్చేందుకు ప్రకాశం బ్యారేజికి గోదావరి జలాలను తరలిస్తున్నారు. మధ్యలో మునేరుకు వరద రావడంతో తరలింపు ఆపి మళ్లీ కొనసాగిస్తున్నారు. గోదావరికి వరదలొచ్చినా సముద్రంలో కలిశాయి. వరదలకు అక్కడక్కడ మిగతా 2లో

సీనియర్ జర్నలిస్ట్ కృష్ణారావు ఇకలేరు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



సీనియర్ జర్నలిస్ట్ సిహెచ్‌విఎం కృష్ణారావు (64) గురువారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని గోపన్‌పల్లి జర్నలిస్ట్ కాలనీలోగల తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏలూరు నుంచి 1975లో స్టింగర్‌గా జర్నలిస్ట్ జీవితం ప్రారంభించిన కృష్ణారావు అంచెలంచెలుగా ఎదిగారు. ఈనాడు, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, డెక్కన్ క్రానికల్, న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో పలు హోదాల్లో పనిచేశారు. జూబ్లిహిల్స్ మహాప్రస్థానంలో శుక్రవారం ఉదయం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కృష్ణారావు మృతి పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ సిఎం కెసిఆర్ ప్రభృతులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న అమర్‌జిత్ కౌర్

మోడీ విధానాలు ప్రజావ్యతిరేకం

- ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్
- విశాఖ టు తిరుపతి సిపిఐ బస్సు యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంభిస్తోన్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అత్యంత దుర్మార్గమైనవని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ విమర్శించారు. 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' పేరిట సిపిఐ ఆధ్వర్యాన విశాఖ నుంచి తిరుపతి వరకూ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్రను గురువారం ఆమె కూర్మన్నపాలెం కూడలిలోని 'ఉక్కు' పరిరక్షణ దీక్షా శిబిరం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. మణిపూర్‌లో శాంతిభద్రతలను కాపాడడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మతతత్వ, విద్వేష పూరిత రాజకీయాలకు పాల్పడుతున్న బిజెపి సర్కారుకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ బస్సు యాత్ర చేపట్టామన్నారు. ఈ క్రమంలో పలు జిల్లాల్లో మిగతా 2లో

ఉపాధి హామీపై ఇక డ్రోన్ల నిఘా

- రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం
- అవినీతి నిరోధం పేరుతో చట్టానికి తూట్లు



లోపలి పేజీలో..

విద్వేష ప్రసంగాలపై 'సుప్రీం'కు సిపిఎం

- ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన బృందా కరత్, కెవిఎం తివారీ

లోపలి పేజీలో..



ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో ఎంఒయు పత్రాలు చూపిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ఎడెక్స్ సంస్థ ప్రతినిధులు

రాష్ట్ర ఉన్నత విద్యలోకి 'ఎడెక్స్'

- ఎంఒయు కుదుర్చుకున్న ప్రభుత్వం
- పేద విద్యార్థులకు వరంలాంటిదన్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఉన్నత విద్యారంగంలోకి మరో కార్పొరేట్ సంస్థ ప్రవేశించింది. ప్రపంచస్థాయిలో ప్రఖ్యాతిగాంచిన విశ్వవిద్యాల యాలు అందించే పలు కోర్సులను ఆన్‌లైన్ ద్వారా అందించే 'ఎడెక్స్' అనే సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఒయు కుదుర్చుకుంది. పేద విద్యార్థులకు ఈ ఒప్పందం వరం లాంటిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన యూనివర్సిటీల్లోని సాంకేతిక పరిజ్ఞానం రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి రానుందని ఆయన తెలిపారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సమక్షంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె శ్యామలారావు, ఎడెక్స్ సంస్థ సిఇఒ అనంత్ అగర్వాల్ గురువారం ఎంఒయులో సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యారంగంలో మరో విప్లవాత్మక మార్పునకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని అన్నారు. ఉన్నత విద్యలో విద్యార్థులకు ప్రపంచస్థాయి కోర్సులు, అత్యుత్తమ యూనివర్సిటీల సర్టిఫికెట్ కోర్సులు ఉచితంగా అందించబోతున్నామని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలు హార్వర్డ్, ఎంఐటి, ఆక్స్‌ఫర్డ్, క్రేంబ్రిడ్జి వంటి వాటి నుంచి మిగతా 2లో

గర్జించిన గంగవరం

'చలో అదానీ గంగవరం పోర్టు'కు వేలాదిగా తరలివచ్చిన కార్మికులు

- ఇసుప కంచెలను దాటుకుంటూ దూసుకెళ్లిన వైనం
- మా భూముల్లో నిర్మించిన పోర్టుపై అదానీ పెత్తనమేంటని ఆగ్రహం
- జీతాలు, ఇతర సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం
- పోలీసు నిర్బంధం, లాఠీఛార్జి



గంగవరం పోర్టు కార్మికులను, అఖిలపక్ష పార్టీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి- గాజువాక (విశాఖపట్నం)

జీతాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్, అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన గురువారం తలపెట్టిన 'చలో అదానీ గంగవరం పోర్టు' కార్యక్రమానికి వేలాదిగా కార్మికులు కుటుంబాలతో తరలివచ్చారు. పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించినా, లాఠీఛార్జి చేసినా వెరవకుండా ఇనుప కంచెలను దాటుకుంటూ పోర్టు మెయిన్ గేటు వద్దకు దూసుకెళ్లారు. తీవ్ర ఉద్రిక్తతల నడుమ పోర్టు ముట్టడి కార్యక్రమం సాగింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ సాగిన ఈ కార్యక్రమంలో అదానీ పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా కార్మికులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తమ భూముల్లో పోర్టు కట్టి.. తమపైనే పెత్తనం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెదగంట్యాడలో నిర్వహిస్తోన్న దీక్షా శిబిరం నుంచి పోర్టు కార్మికులు మూడు కిలోమీటర్ల దూరంలోని పోర్టుకు మహా ప్రదర్శనగా బయలుదేరారు. పోలీసులు ఆ మార్గంలో మూడుచోట్ల ఇనుప కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. అవేవీ కార్మికుల పోరును ఆపలేకపోయాయి. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, నాయకులు కొవిరి అప్పలరాజు, వైసిపి గాజువాక ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, టిడిపి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన పార్టీ కార్పొరేటర్ దల్లి గోవింద కార్మికులకు మద్దతు తెలిపి వారిని మిగతా 2లో



తెలుగుగంగ కాలువకు నీటిని విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

'తెలుగు గంగ'కు నీటి విడుదల

ప్రజాశక్తి- వెలుగోడు, నందికొట్కూరు (నంద్యాల జిల్లా)

నంద్యాల జిల్లా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (విబిఆర్)కు చెందిన ఒక గేటును ఎత్తి తెలుగుగంగ కాలువకు గురువారం వెయ్యి క్యూసెక్కుల నీటిని ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల రైతుల సాగు అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, తెలుగుగంగ అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

'హంద్రీనీవా' నుంచి 674 క్యూసెక్కులు

మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి రెండు పంపుల ద్వారా హంద్రీనీవా కాలువకు 674 క్యూసెక్కుల నీటిని కర్నూలు, నంద్యాల, చిత్తూరు, అనంతపురం జిల్లా ప్రజల సాగు, తాగునీటి అవసరాల కోసం అధికారులు బుధవారం రాత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంలో 863 అడుగులకు నీటిమట్టం చేరుకోవడంతో హంద్రీనీవాకు నీటిని విడుదల చేశామన్నారు. ఏటా 40 టిఎంసిల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.

జైలుకు గోగూండా బిట్టూ

గురుగ్రామ్ : పోలీసులపై దాడి, బెదిరింపుల కేసులో అరెస్టయిన గో గూండా బిట్టూ బజరంగ్ అలియాస్ రాజ్‌కుమార్‌కు గురువారం నుహ్ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఎసిపి ఉషా కుండా ఫిర్యాదు మేరకు నుహ్ సదర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం... 'నల్హార్ గుడికి కత్తులు, త్రిశూలాలు తీసుకుని వెళ్తున్న బిట్టూ భజరంగ్, అతని మద్దతుదారులను ఎసిపి ఉషా కుండు నేతృత్వంలో పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. బిట్టూ నాయకత్వంలోని మూక పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసింది. చంపుతామని బెదిరించింది. వాహనాల నుంచి ఆయుధాలను కూడా లాక్కుంది'. ఈ నెల 15న ఫరీదాబాద్‌లో బిట్టూను అరెస్టు చేశారు. అప్పటి నుంచి నుహ్ సదర్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న బిట్టూను గురువారం నుహ్ కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో ఫరీదాబాద్ జిల్లా నీమ్కా జైలుకు తరలించారు. నుహ్ మతపరమైన హింసాకాండ కేసులో ఈ నెల ప్రారంభంలో అరెస్టయిన బిట్టూ ఆ తరువాత బెయిల్‌పై ఉన్నాడు.

ప్రభుత్వ కార్యక్రమంగా టంగుటూరి జయంతి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యోత్సవాలను ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 23వ తేదీన టంగుటూరి జయంతిని స్టేట్‌ఫంక్షన్‌గా నిర్వహించాలని అన్ని శాఖలకు సాధారణ పరిపాలన శాఖ సర్క్యులర్ జారీ చేసింది. శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు దీనిపై చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

అక్టోబరు చివరి నాటికి ఎన్‌బిఎ గుర్తింపు

- సాంకేతిక విద్యాశాఖ కమిషనరు నాగరాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి అక్టోబరు చివరి నాటికి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఎ) గుర్తింపును పొందాలని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనరు చదలవాడ నాగరాణి అన్నారు. విద్యాసంస్థలకు ఎన్‌బిఎ అక్రిడిటేషన్ వుంటే విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు వస్తాయని తెలిపారు. గురువారం ఆమె తన ఛాంబర్ నుంచి ఎన్‌బిఎ అక్రిడిటేషన్‌కు సంబంధించిన పురోగతిపై రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్స్‌తో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలోని ఏడు పాలిటెక్నిక్ కళాశాలలు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ నుండి గుర్తింపును అందుకున్నాయని, రానున్న మూడు నెలల్లో అన్నింటికీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఎన్‌బిఎ బృందం మరో ఆరు పాలిటెక్నిక్‌ల సందర్శనకు సమయం ఇచ్చినందున, ఆయా ప్రిన్సిపల్స్ ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రాంగణాలను పరిశుభ్రంగా వుంచడంతోపాటు ప్రతి చిన్న విషయంపైనా శ్రద్ధ పెట్టాలన్నారు. మిగిలిన పాలిటెక్నిక్‌లు సైతం వెంటనే ఎన్‌బిఎ బృందం సందర్శనకు తేదీలు లభించేలా కార్యాచరణ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకులు వెలగా పద్మారావు, సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి రమణబాబు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర ఉన్నత విద్యలోకి 'ఎడెక్స్'

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్త సర్టిఫికెట్లను విద్యార్థులకు అందిస్తామన్నారు. ఈ ఒప్పందం ఉన్నత విద్యలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని అన్నారు. నిరుపేద విద్యార్థులకు ఈ ఒప్పందం కారణంగా మరింత మేలు జరుగుతుందన్నారు. హార్వర్డ్, ఎంఐటి, క్రేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ లాంటి యూనివర్సిటీలతో ఎడెక్స్‌తో వున్న ఒప్పందం మేరకు మనకు కలిసి వస్తుందన్నారు. శాస్త్ర, సాంకేతిక, సామాజిక, సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన వివిధ రకాల సబ్జెక్టులు, ఈ ఒప్పందం ద్వారా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మన దేశంలో లభ్యంకాని ఎన్నో కోర్సులను నేర్చుకునే అవకాశం వస్తుందన్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి కోర్సులే కాదు, ఆర్ట్స్, కామర్స్‌లో పలురకాల సబ్జెక్టులకు చెందిన కోర్సులు ఈ ఒప్పందం ద్వారా మన విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని, మంచి ఉపాధి, ఉద్యోగావకాశాలు రాష్ట్ర విద్యార్థులకు దక్కాలి అనే ప్రభుత్వ లక్ష్యం సాకారం కానుందని అన్నారు. ప్రపంచ స్థాయిలో రాష్ట్ర విద్యార్థులు పోటీ పడేలా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో విద్యారంగంలో ఎన్నో సంస్కరణలను తెచ్చామని అన్నారు.

మోడీ విధానాలు ప్రజావ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక సమస్యలపై సదస్సులు, సభలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విధానాల వల్ల అన్ని తరగతుల ప్రజలూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో విఫలమైందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు జెవి.సత్యనారాయణమూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు, ఆర్.రవీంద్రనాథ్, అక్కినేని వనజ, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు. బస్సుయాత్రకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్, నాయకులు ఎన్.రామారావు తదితరులు మద్దతు తెలిపారు.

బిజెపిని సాగనంపితేనే మహిళలకు రక్ష

- అక్టోబరు 5న చలో ఢిల్లీ మార్చ్
- మహిళలు స్వేచ్ఛగా, హుందాగా జీవించే హక్కును నిరాకరిస్తున్న మోడీ సర్కార్
- ఐద్వా జాతీయ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహిళలు స్వేచ్ఛగా, హుందాగా జీవించే హక్కును నిరాకరిస్తున్న దేశంగా భారత్ మారడానికి కారణమైన నరేంద్ర మోడీ నేతృత్వంలోని బజెపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ఐద్వా జాతీయ సదస్సు పిలుపునిచ్చింది. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ ప్రభుత్వం మహిళా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అమలుచేస్తోందని విమర్శించింది. మనువాదాన్ని దేశంపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్న 'ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిని తరిమికొట్టండి, మహిళలను రక్షించండి, దేశాన్ని రక్షించండి (బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ హఠావో.. దేశ్ బచావో, మహిళా బచావో)' అన్న నినాదంతో అక్టోబరు 5న ఢిల్లీ చలో మార్చ్ నిర్వహించాలని ఐద్వా జాతీయ సదస్సు నిర్ణయించింది. గురువారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లోని జరిగిన ఈ సదస్సుకు 20 రాష్ట్రాల నుంచి వెయ్యిమంది ప్రతినిధులు హాజరయ్యారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో హింసకు గురైన 15 మంది మహిళలు సదస్సులో మాట్లాడారు. బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వ మహిళా వ్యతిరేక మత రాజకీయాలను నిరసిస్తూ వేలాదిమంది మహిళలను సమీకరించాలని కన్వెన్షన్ తీర్మానించింది. ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రణాళికాబద్ధంగా చేస్తున్న ప్రయత్నాలను సదస్సు ఖండించింది.

మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయి: బృందా కరత్

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రమాణాల నుంచి రక్తహీనతను మినహాయించడం దారుణమని ఐద్వా సీనియర్ నేత బృందాకరత్ విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి ఆహార పదార్థాలపై కూడా జిఎస్‌టి విధించడం. నిరుద్యోగత తీవ్ర రూపం దాల్చడం ఇవన్నీ మహిళల భద్రతను మరింత ప్రమాదంలోకి నెడుతున్నాయని అన్నారు. ఉపాధి హామీ పథకంలో ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నీటి సరఫరా, విద్యుత్, రవాణా, పారిశుధ్య రంగాలను ప్రైవేటీకరిస్తూ సామాన్యులపై ప్రభుత్వం మరిన్ని భారాలు మోపుతోందని అన్నారు . ఆరోగ్య రంగంపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చులో భారీగా కోత విధించడం వల్ల మహిళలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. మహిళలపై దాడులు గురించి ఇక వేరే చెప్పనక్కర్లేదన్నారు. అధికారిక లెక్కల ప్రకారమే 2021లో సగటున రోజుకు 86 అత్యాచార కేసులు నమోదవుతున్నాయని అన్నారు. కతువా, ఉన్నావ్, హత్రాస్‌లలో మహిళలపై దాడులకు పాల్పడిన వారికి రాజకీయ దన్ను ఉందని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పోక్సో చట్టాన్ని తుంగలో తొక్కుతున్నాయని అన్నారు. మణిపూర్ అల్లర్లు, హర్యానా వివాదంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఐద్వా అధ్యక్షులు పికె శ్రీమతి టీచర్, ప్రధాన కార్యదర్శి మరియం ధావలే డిక్లరేషన్ పత్రాన్ని సమర్పించారు. వివిధ సెషన్లలో చర్చలు జరిగాయి. ఈ కన్వెన్షన్‌లో సుభాషిణి అలీ, ఎస్ పుణ్యవతి, సిఎస్ సుజాత, ఆశా శర్మ, ప్రొఫెసర్ అర్చనా ప్రసాద్ పాల్గొన్నారు.



ఐద్వా జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న బృందా కరత్

పాఠ్యాంశాలుగా బాలల హక్కుల చట్టాలు

- కమిషన్ ఛైర్మన్ కేసలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పాఠశాల విద్యలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు బాలల హక్కుల చట్టాలను పాఠ్యాంశాలుగా చేర్చే అంశంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ఈ మేరకు గురువారం మహిళా శిశు సంక్షేమశాఖ కమిషనరు జానకిని కలిసి బాలల హక్కుల పరిరక్షణకు పాఠ్యాంశాల ముద్రింపుపై చర్చించారు. విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మికుల వ్యవస్థ, నిర్బంధ విద్యాహక్కు చట్టం, లైంగిక వేధింపుల నివారణ, దత్తత, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లయితే వారికి ఉపయోగం ఉంటుందని అప్పారావు అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు రాజేంద్ర ప్రసాద్, త్రిపర్ణ, ఆదిలక్ష్మి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

యువతతో చేపలు అమ్మిస్తున్నారు : లోకేష్

- నేడు పాదయాత్రకు విరామం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పరిశ్రమలు తెచ్చి ఉద్యోగాలివ్వడం చేతకాక... వైసిపి ప్రభుత్వం చదువుకున్న యువతతో చేపలు, మాంసం దుకాణాలు పెట్టించారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర గుంటూరు జిల్లాలో సాగింది. గురువారం మంగళగిరి మండలం యర్రబాలెం నుంచి ప్రారంభమైన యాత్ర తాడేపల్లి మండలం ఉండవల్లి వరకు సాగింది. పాదయాత్రలో భాగంగా మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని వివిధ తరగతుల ప్రజలు, రైతులతో ఆయన మాట్లాడారు. నులకపేటలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర దుకాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేతిబీరలో నెయ్యి లేనట్లే... ఫిష్ ఆంధ్రలో చేపలు లేవని విమర్శించారు. రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకురాలేక.. యువతతో చేపలు అమ్మిస్తున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన రైతులకు శాపంగా మారిందన్నారు. వైసిపి పాలనలో కేవలం నలుగురు రెడ్లు మాత్రమే బాగుపడ్డారని తెలిపారు. తాడేపల్లి ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో స్త్రీశక్తి ప్రతినిధులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అధికారంతో సంబంధం లేకుండా మంగళగిరి నియోజకవర్గంలో 27 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నానని లోకేష్ తెలిపారు. స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు వివిధ వత్తుల్లో శిక్షణతోపాటు పనిముట్లు కూడా అందజేస్తు న్నామన్నారు. అధికారంలోకి వచ్చాక స్త్రీ శక్తి మోడల్ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా చేపడతామని స్పష్టం చేశారు. గురువారం రాత్రి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వద్ద బస చేశారు. శుక్రవారం కోర్టు వాయిదా ఉండడంతో విరామం ప్రకటించారు.



గుంటూరు జిల్లా తాడేపల్లిలో పాదయాత్ర చేస్తున్న లోకేష్

'జనసేన జనవాణి'కి 340 ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

ఉత్తరాంధ్ర ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జనసేన ఆధ్వర్యంలో గురువారం విశాఖలోని దసపల్లా హోటల్‌లో ఏర్పాటు చేసిన జనవాణి కార్యక్రమానికి 340 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అవసరమైతే పోరాటం చేస్తానని తెలిపారు. ఇటీవల మృతి చెందిన జనసేన క్రియాశీలక సభ్యులైన పాలకొండకు చెందిన రెడ్డి గోవింద్, అనకాపల్లికి చెందిన రాజబాబు, యలమంచిలికి చెందిన గంధం గోపి, అడ్డంనేని శ్రీను, పాయకరావుపేటకు చెందిన సమ్మంగి చిన్నా కుటుంబాలకు రూ.5 లక్షల చెక్కులను అందజేశారు. జనవాణిని ఉద్దేశించి పార్టీ రాష్ట్ర నాయకులు నాదెండ్ల మనోహర్ మాట్లాడారు.



వికలాంగురాలి సమస్యను వింటున్న పవన్

ఇప్పటి వరకూ నిర్వహించిన జనవాణి కార్యక్రమాలకు 4,350 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు మరణించిన 148 మంది క్రియాశీలక సభ్యులకు రూ.5 లక్షల చొప్పున, సుమారు 750 మంది ప్రమాద బాధితులకు రూ.50 వేలు చొప్పున సాయం అందించామన్నారు. పవన్‌కు అందిన ఫిర్యాదుల్లో భూకబ్జాలు, వైపిపి నేతల దౌర్జన్యాలు, హైడ్రో ప్రాజెక్టు ద్వారా గిరిజనులకు ఎదురయ్యే ఇబ్బందులు, ఎల్‌జి పాలిమర్స్ బాధిత కుటుంబాలకు దక్కని న్యాయం, ఫార్మాసిటీ, స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు చెందిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఎయు విసి ప్రసాద్‌రెడ్డి చేపడుతున్న రాజకీయ కార్యకలాపాలపైనా కొంతమంది ఫిర్యాదు చేశారు.

గర్జించిన గంగవరం

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు నడిపించారు. ఈ క్రమంలో పోర్టుకు కిలోమీటరు సమీపంలో పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పోలీసులు లాఠీఛార్జి చేశారు. దీంతో, కొందరి కార్మికులకు గాయాలయ్యాయి. ఇద్దరు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. పోలీసులు ఎంత నిర్బంధం ప్రయోగించినా కార్మికులు వెనక్కి తగ్గకుండా పోర్టు మెయిన్ గేటు వరకూ దూసుకెళ్లారు. 'జీతాలైనా పెంచండి.. మా సముద్రాన్నైనా మాకు ఇచ్చేయండి' అంటూ పోర్టు మెయిన్ గేటును ముట్టడించి అక్కడ ధర్నా చేశారు. ఈ ధర్నాకు మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య మద్దతు తెలిపి మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ తక్షణమే కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో, అక్కడకు ఆర్‌డిఓ హుస్సేన్ సాహెబ్ వచ్చారు. నాయకులతో మాట్లాడిన అనంతరం ఆయన పోర్టు యాజమాన్యంతోనూ చర్చించారు. అదానీ పోర్టు యాజమాన్యం కొన్ని సమస్యలను పరిష్కరిస్తుందంటూ ఆయన చెప్పుకురాగా, కార్మికులు సంతృప్తి చెందలేదు. అవసరమైతే గేటును బద్దలు కొట్టుకుని లోపలకు వెళ్తామని నినదించారు. ఆర్‌డిఓ స్పందిస్తూ, సమస్యలను వినతిపత్రం రూపంలో తనకు ఇవ్వాలని కోరారు. దీంతో, ఆయనకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి నాలుగు రోజుల సమయం కావాలని పోర్టు యాజమాన్యం కోరింది. దీంతో, కార్మికులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. గడువులోగా సమస్యలను పరిష్కరించకుంటే మళ్లీ పోర్టును ముట్టడిస్తామని హెచ్చరించారు. పోర్టు ముట్టడి నేపథ్యంలో తలెత్తిన తోపులాటలో కొద్దిమంది పోలీసులకూ గాయాలయ్యాయి.



గంగవరం పోర్టులోకి వెళ్లనీయకుండా గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.జగన్, గంగారావులను అడ్డుకుంటున్న పోలీసులు

లాఠీఛార్జికి సిపిఎం, సిఐటియు ఖండన

కార్మికులపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఖండించారు.

కార్మికులపై లాఠీచార్జి అమానుషం : సిపిఐ

అదానీ గంగవరం పోర్టు కార్మికులపై పోలీసుల లాఠీచార్జిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. శాంతియుత వాతావరణంలో నిరసన చేస్తున్న గంగవరం పోర్టు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులపై లాఠీచార్జి చేయడం అమానుషమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ గ్రూపునకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని అన్నారు. ఈ చర్యతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్మిక వ్యతిరేకి అని నిరూపించుకున్నారని పేర్కొన్నారు. అటు చలో గంగవరం పోర్టు పిలుపునకు అన్ని రాజకీయ పార్టీలూ మద్దతు తెలిపాయన్నారు.

రాష్ట్రానికి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

- 26న విశాఖ గ్రామీణ ప్రాంతాల్లో పర్యటన
- గ్రామీణాభివృద్ధి పథకాలపై అధ్యయనం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్ర నిధులతో అమలు జరుగుతున్న గ్రామీణాభివృద్ధి పనులను అధ్యయనం చేసేందుకు పార్లమీంటరీ స్టాండింగ్ కమిటీ రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ నెల 26వ తేదీన విశాఖకు చేరుకునే బృందం ఆ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సందర్శించనుంది. దీనికోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని లోక్‌సభ కార్యాలయం నుంచి రాష్ట్ర అధికారులకు సమాచారం అందింది.

కేంద్రం నిధుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. విశాఖతోపాటు చెన్నై, మధురై, కొడైకెనాల్‌లో కూడా కమిటీ పర్యటించనుంది. ఇందులో భాగంగానే ఆయా పథకాల అమలులో పాలుపంచుకుంటున్న బ్యాంకర్లతో కూడా కమిటీ భేటీ కానుంది.

చర్చలు రహస్యంగా

పర్యటన సందర్భంగా అధికారులు, బ్యాంకర్లతో జరిగే చర్చలు రహస్యంగా ఉండాలని లోక్‌సభ కార్యాలయం జారీ చేసిన మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఈ చర్చల వివరాల మినిట్స్ కూడా ఇతరులకు భాగస్వామ్యం లేకుండా చూడాలని నిర్దేశించడం గమనార్హం. మీడియాతోపాటు ఇతర బయట వ్యక్తులకు కూడా సమాచారం పొక్కకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు ఎస్‌ఎల్‌బిసి కన్వీనర్‌గా ఉన్న యూనియన్ బ్యాంకు, లీడ్ బ్యాంకుగా ఉన్న స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని లోక్‌సభ కార్యాలయం పేర్కొంది.

సర్పంచుల పాలనకు తిలోదకాలు

- కోనసీమ పర్యటనలో టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి- రావులపాలెం, ఆలమూరు



గ్రామాల్లో సర్పంచుల పాలనకు వైసిపి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో ఆయన గురువారం పర్యటించారు. తొలుత మండపేట- ఆలమూరు రోడ్డులోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన రైతులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆలమూరులో రోడ్ షో నిర్వహించారు. జొన్నాడలో ఇసుక గుట్టల వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. రావులపాలెంలోని వాకులరాజు సెంటర్లో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. సర్పంచులకు తెలియకుండానే పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని విమర్శించారు. గ్రామాల్లో సర్పంచుల పాలనకు బదులు వలంటీర్లు, వైసిపి నాయకుల పాలన సాగుతోందని దుయ్యబట్టారు. కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి... తాడి మోహన్‌రెడ్డి అనే బినామీ పేర ఇసుకను సేకరించి కోట్లాది రూపాయలను కాజేస్తున్నారన్నారు. కోనసీమ జిల్లాలో లభ్యమవుతున్న నాణ్యమైన ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ కోట్లాది రూపాయాలను పోగేసుకుంటున్నారని, ఇసుక మాఫియా అంతా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కనుసన్నల్లోనే జరుగుతుందని విమర్శించారు.

ఆర్‌టిసి బస్సులో చంద్రబాబు ప్రయాణం

కోనసీమ జిల్లాల పర్యటనకు వచ్చిన చంద్రబాబు ఆలమూరు నుంచి జొన్నాడ వరకూ సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఆర్‌టిసి బస్సులో ప్రయాణించారు. కండక్టర్ వద్ద టికెట్ కొన్న ఆయన... బస్సుల్లో పలువురు మహిళలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర ధరలు, ప్రభుత్వ పన్నులు, కరెంట్ ఛార్జీల పెంపు తదితర విషయాలను మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

విగ్రహాల తొలగింపులో హైడ్రామా

- నందిగామలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - నందిగామ (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ గాంధీ సెంటర్లోని జాతీయ నాయకుల విగ్రహాలను అర్ధరాత్రి సమయంలో అధికారులు తొలగించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. బుధవారం అర్ధరాత్రి సమయంలో మున్సిపల్ అధికారులు భారీఎత్తున పోలీసు యంత్రాంగంతో వచ్చి నందిగామ గాంధీ సెంటర్లోని అంబేద్కర్, గుర్రం జాషువా, రాజీవ్‌గాంధీ, మహాత్మా గాంధీ, దేవినేని వెంకట రమణ, తంగిరాల ప్రభాకర్ రావు, బాబూ జగజీవన్‌రావు, భగత్ సింగ్, మహాత్మా జ్యోతిరావు పూలే, ఎన్‌టిఆర్, పొట్టి శ్రీరాములు, ఇందిరాగాంధీ తదితర నేతల విగ్రహాలను పొక్లయినర్లతో తొలగించారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమ వాటిని తరలించారు. విగ్రహాల తొలగింపునకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు ఆందోళనకు దిగారు. అభివృద్ధి పేరుతో జాతీయ నాయకుల విగ్రహాలు తొలగించడానికి వీల్లేదంటూ అడ్డుకున్నారు. సెంటరులోని మరో ప్రాంతంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం తొలగించకుండా మిగిలిన వారి విగ్రహాలు తొలగించడం ఏమిటంటూ నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నందిగామ మున్సిపల్ అధికారులు ఎటువంటి ముందస్తు నోటీసులూ ఇవ్వకుండా విగ్రహాలను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం గాంధీ సెంటర్‌కు నాలుగువైపులా రాకపోకలు సాగించకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తంగిరాల సౌమ్య, పలువురు టిడిపి నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జయరామ్ మాట్లాడుతూ కోర్టు నిబంధనల మేరకు న్యాయపరంగానే ఆర్‌అండ్‌బి రోడ్డు పరిధిలో ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్న విగ్రహాలను తొలగించామని చెప్పారు. తిరిగి వాటిని అక్కడే మరోచోట రెండు మూడు నెలల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంట్లో ఎలాంటి రాజకీయాలు లేవని పేర్కొన్నారు.

టిడిపి నేతల పిటిషన్లపై తీర్పు వాయిదా

- ముగిసిన వాదనలు

ప్రజాశక్తి-అమరావతి

అన్నమయ్య జిల్లా, అంగళ్లులో చోటుచేసుకున్న ఘటనలో ముదివేడు పోలీసులు తమపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని టిడిపి నేతలు వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ ముగించింది. తీర్పును రిజర్వులో పెట్టింది. తీర్పు తర్వాత వెలువరిస్తామని జస్టిస్ కె సురేష్ రెడ్డి గురువారం ప్రకటించారు. తీర్పు వెలువరించే వరకు పిటిషనర్లను అరెస్టు చేయరాదని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయకుడు పుంగనూరు పర్యటన సందర్భంగా అంగళ్లులో జరిగిన ఘటనల నేపథ్యంలో ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని టిడిపి సీనియర్ నాయకులు దేవినేని ఉమామహేశ్వరరావు, నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, పులివర్తి నాని వేర్వేరుగా వ్యాజ్యాలను దాఖలు చేసిన విషయం తెలిసిందే.

మరో కేసులో..

అంగళ్లులో చోటుచేసుకున్న ఘటనా సమయంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాస్‌రెడ్డి లేరనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, సంఘటనా స్థలంలో లేకపోయినా పోలీసులు కేసు నమోదు చేసినట్లుగా ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని తెలిపారు. పిటిషనర్ ఆగస్టు 4న జరిగిన ఘటనా సమయంలో కడప నుంచి హైదరాబాద్, అక్కడ నుంచి ఢిల్లీకి విమానంలో వెళ్లినట్లుగా టిక్కెట్లను న్యాయవాది చూపించారు. సాక్షుల వాంగ్మూలాల ఆధారంగానే పిటిషనర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారని అదనపు ఎజి చెప్పారు. ఇంట్లో ఉండి కూడా బోర్డింగ్ పాస్ తీసుకోవచ్చునని అన్నారు. హత్యాయత్నం వంటి కేసులో క్వాష్ పిటిషన్ చెల్లదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, కేసు దర్యాప్తుపై స్టే విధించడం లేదని చెప్పింది. అయితే, పిటిషనర్లకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. హత్యాయత్నం కేసులో క్వాష్ పిటిషన్‌పై ఉత్తర్వులు ఇవ్వలేమని, ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునని పిటిషనరుకు సూచించింది.

నిస్తేజంగా ఖరీఫ్ సేద్యం

(మొదటి పేజీ తరువాయి)

పంటలు దెబ్బతిన్నాయి. జులై చివరిలో ఆగస్టు మొదటిలో కొన్ని ప్రాంతాల్లో వారానికిపైగా ఎడతెరిపి లేకుండా వానలు కురవడంతో అక్కడక్కడ పంటలు దెబ్బతిన్నాయి. అనంతరం వానలు పూర్తిగా ఆగిపోవడంతో ప్రస్తుతం తీవ్ర డ్రై-స్పెల్ నెలకొంది. కొత్తగా పంటల సాగు అటుంచి వేసిన పంటలు ఎండుముఖం పట్టాయి.

51 శాతమే

ఆగస్టు మూడవ వారం వచ్చినా ఖరీఫ్ సీజన్‌లో కావాల్సిన పంటల సేద్యంలో 51 శాతమే నమోదైంది. సీజన్ నార్మల్ 85.97 లక్షల ఎకరాలు కాగా ఇప్పటికి 43.77 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఆగస్టు 16 వరకు కావాల్సిన 61.20 లక్షల ఎకరాల్లో 17.43 లక్షల ఎకరాల్లో (28 శాతం) సాగు తగ్గింది. వరి 3.53 లక్షల ఎకరాలు (15 శాతం), తృణధాన్యాలు 15 వేల ఎకరాలు (10 శాతం), పప్పుధాన్యాలు 1.77 లక్షల ఎకరాలు (38 శాతం), మొత్తం ఆహారధాన్యాలు 5.62 లక్షల ఎకరాలు (17 శాతం), వేరుశనగ 7 లక్షల ఎకరాలు (51 శాతం), మొత్తం నూనెలగింజలు 6.95 లక్షల ఎకరాలు (47 శాతం), పత్తి 3.88 లక్షల ఎకరాలు (31 శాతం) తగ్గింది.

ఆగస్టు 16 వరకు ఖరీఫ్ సాగు (లక్షల ఎకరాలు)

పంట	సీజన్ నార్మల్	కావాల్సిన సాగు	ఇప్పటికి సాగైంది
వరి	38,80	24.25	20.72
తృణధాన్యాలు	4.70	3.35	3.00
పప్పుధాన్యాలు	7.87	4,62	2,85
ఆహారధాన్యాలు	51.40	32.22	26.60
వేరుశనగ	16.10	13,75	6.75
నూనెగింజలు	17.40	14.77	7.82
పత్తి	15.45	12.60	8.72
మొత్తం	**85.97**	**61.20**	**43,77**

పిఆర్‌సి ఒప్పందం చెల్లదు

- ఎపిఎస్‌ఇబి ఇంజినీర్స్, ఎఇఇ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణపై తమ సంతకాలు లేకుండా ఒప్పందం చెల్లదని ఎపిఎస్‌ఇబి ఇంజినీర్స్ అసోసియేషన్, ఎపిఎస్‌ఇబి ఎఇఇ అసోసియేషన్ పేర్కొన్నాయి. ఈ మేరకు ఎపిఎస్‌ఇబి ఎఇఇఎ ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రతాప్, ఎపిఎస్‌ఇబిఇఎ ప్రధాన కార్యదర్శి పి ప్రతాప్‌రెడ్డి గురువారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ సంస్థల త్రైపాక్షిక ఒప్పందంలో తాము కూడా భాగస్వాములేమని పేర్కొన్నారు. త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం తమకు వేతనం ఒప్పందం జరగాలని అన్నారు.

కానీ తమ ప్రమేయం లేకుండా విద్యుత్ యాజమాన్యం, ఎపిఎస్‌ఇయు యూనియన్ 327, ఎపిఇఇయు యూనియన్ 1104, వైఎస్‌ఆర్‌విఇయు హెచ్-128, టిఎన్‌టియుసి ట్రేడ్ యూనియన్లతో ఒప్పందం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం పరిధిలోకి ఇంజినీర్ ఉద్యోగులు రారని తెలిపారు. చాలా యూనియన్లు, అసోసియేషన్లతో సమావేశాలు, చర్చలు జరిపారని పేర్కొన్నారు. ఈ నెల 16న అగ్రిమెంట్‌పై మాత్రం కేవలం నాలుగు గుర్తింపు యూనియన్లతో సంతకాలు చేయించి మిగిలిన వాటిని వదిలేశారని పేర్కొన్నారు. ఇంజినీర్ ఉద్యోగుల న్యాయమైన, హేతుబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. దీనిపై తమతో మరోసారి చర్చలను పున:ప్రారంభించాలని కోరారు. నాలుగు యూనియన్లతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేయొద్దన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు నిలిపేయాలి

- టిఎన్‌యుఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల పని సర్దుబాటు నిలిపేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు గురువార ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవిలో బదిలీలు జరిపి మరలా రెండు నెలల్లోపే సర్దుబాటు చేయడం దేనికని ప్రశ్నించారు. అలాంటప్పుడు అన్ని సర్దుబాట్లు అయ్యేక బదిలీలు జరపాల్సిందని అన్నారు. బదిలీపై వచ్చిన వారు జీతాలు కూడా తీసుకోక ముందే మరలా వేరే స్కూల్‌కు సర్దుబాటు చేయడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు.

'ఎంఎస్‌ఎంఇ'ల మార్కెటింగ్‌పై దృష్టి

- అధికారులకు సిఎం ఆదేశం
- పోర్టులపై సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎంఎస్‌ఎంఇలలో తయారయ్యే ఉత్పత్తుల మార్కెటింగ్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన పోర్టులతో పాటు, ఎంఎస్‌ఎంఇలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విదేశాల తరహాలో నిర్వహణ, నాణ్యమైన ఉత్పాదన విధానాలను అమల్లోకి తీసుకురావాలన్నారు. తక్కువ ధరకు విద్యుత్ అందించడం, తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వగలిగితే అవి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగులుతాయని చెప్పారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ సౌకర్యంతోపాటు, అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందించగలగాలని సూచించారు. దీనిపై కేంద్రంతో మాట్లాడి నూతన విధానాలను తీసుకురావడం ద్వారా ఎంఎస్‌ఎంఇలకు చేయూతనిచ్చేలా కార్యక్రమాలను సమర్థవంతంగా రూపొందించాలని చెప్పారు. పర్యావరణ హిత విధానాలకు పెద్ద పీట వేయాలన్నారు. . హ్యాండ్‌లూమ్, గ్రానైట్ రంగాల్లో ఎంఎస్‌ఎంఇలను క్లస్టర్లుగా విభజించాలని సూచించారు. అనంతరం పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనుల పురోగతిపై సిఎం అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రామాయపట్నం పోర్టులో సౌత్, నార్త్ బ్రేక్‌వాటర్ పనులు దాదాపు పూర్తయ్యాయని వారు తెలిపారు. సెప్టెంబరు కల్లా డ్రెడ్జింగ్ రిక్లమేషన్ పనులు పూర్తవుతాయని వివరించారు. 19 బెర్తులు, 138 మిలియన్ టన్నుల కార్గో రవాణా లక్ష్యంగా నిర్మాణం జరుగుతోందని తెలిపారు. మొత్తం అన్ని దశల్లో రూ.3736 కోట్లు ఖర్చవుతుందని వివరించారు. మచిలీపట్నం పోర్టులో 16 బెర్తులు, 115 మిలియన్ టన్నుల కార్గో రవాణా సామర్థ్యం ఉందని తెలిపారు. రూ.5,155 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. మూలపేట పోర్టులో పది బెర్తులకు గాను తొలిదశ నాలుగు బెర్తుల్లో రెండు బెర్తుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, 83 మిలియన్ టన్నుల కార్గో రవాణా లక్ష్యంగా రూ.4361 కోట్లతో నిర్మిస్తున్నట్లు వివరించారు. అలాగే కాకినాడలో రూ.2,123 కోట్లతో చేపట్టనున్న గేట్‌వే పోర్టు నిర్మాణ ప్రగతిని సిఎంకు వివరించారు. వీటితోపాటు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంపైనా దృష్టి సారించారు. ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం,జువ్వలదిన్నె పనుల వివరాలను సిఎం అడిగి తెలుసుకున్నారు. జువ్వలదిన్నెలో 86 శాతం, నిజాంపట్నంలో 62 శాతం, మచిలీపట్నంలో 56.22 శాతం, ఉప్పాడలో 55.46 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. మొదటిదశలో మంచినీళ్ల పేట ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని పూర్తిచేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులకు సూచించారు. రెండోదశలో బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, ఓడరేవు, బియ్యపుతిప్పలో నిర్మాణం చేపట్టాలని సూచించారు. అలాగే నెల్లూరు జిల్లా నేలటూరు జెట్టీ నిర్మాణం, భీమిలి, అనకాపల్లి జిల్లా రాజయ్యపేట, విజయనగరం జిల్లా చింతపల్లి, తిరుపత్తి జిల్లా రాయదరువు, అనాకపల్లి జిల్లా దొండవాక, కాకినాడ జిల్లా ఉప్పులంకలో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు.


గురువారం అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం

తిరుమలలో చిక్కిన మరో చిరుత

- ట్రోల్స్‌ను ఖండించిన టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుమల, మడకశిర రూరల్

తిరుమలలో మరో చిరుత బోనులో చిక్కింది. లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో అమర్చిన బోనులో గురువారం వేకువజామున చిరుత చిక్కింది. ఈ ప్రదేశాన్ని టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డితో కలిసి టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం మీడియాతో ఛైర్మన్ మాట్లాడుతూ.. బోనులో చిక్కింది మగ చిరుత అని, ఐదేళ్ల వయస్సు ఉంటుందని అధికారులు నిర్ధారించారని చెప్పారు. యాత్రికులకు నడకదారిలో భద్రత కల్పిస్తూనే, చిరుతలను బంధించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యాత్రికుల చేతికి కర్రలు ఇచ్చి టిటిడి బాధ్యతల నుంచి తప్పుకుందని సోషల్ మీడియాలో విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. 'ఆపరేషన్ చిరుత'ను కొనసాగిస్తామని, అటవీ అధికారుల సూచనల మేరకే యాత్రికుల చేతికి కర్రలు ఇచ్చామని వివరించారు. ఎస్‌వి జూపార్కు నుంచి చిరుతలను తెచ్చి వదులుతున్నామని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. చిరుత సంచారంపై నిఘా కోసం కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎలుగుబంట్ల సంచారంపై డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచామని తెలిపారు.

మడకశిరలో మరో చిరుత మృతి

శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం మేళవాయి గ్రామ పరిధిలో మరో చిరుత మృతి చెందింది. బుధవారం ఓ ఆడ చిరుత మరణించగా..గురువారం మగ చిరుత మృతదేహం లభ్యమయ్యింది. ఈ రెండు చిరుతలు మంగళవారం రాత్రే మృతిచెందినట్లు అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. విష ఆహారం తినడం వల్ల మృతి చెందాయా? లేక అనారోగ్యంతో మరణించాయా? అన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మృతిచెందిన రెండు చిరుతల వయస్సు 18 నెలలు ఉంటుందని, చిరుతల శరీర అవశేషాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి, వాటి మృతికి కారణాలను విశ్లేషిస్తామని సత్యసాయి జిల్లా ఫారెస్ట్ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి మీడియాకు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం మాట్లాడరేం : సిపిఎం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ జిల్లాలో రాష్ట్ర రాజకీయ పార్టీల అగ్రనాయకులందరూ పర్యటనలు చేస్తున్నా.. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణ కోసం ఒక్క మాటైనా మాట్లాడకపోవడం శోచనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లోకనాథం విమర్శించారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల ఒకటిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, 10వ తేదీ నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్, 15న టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు విశాఖలో పర్యటించారని గుర్తుచేశారు. వీరి పర్యటనల్లో, ఉపన్యాసాల్లో ఎక్కడా స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా బిజెపితో పోట్లాడతామని ఒక్కరైనా మాట్లాడలేదని విమర్శించారు. 917 రోజులుగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉద్యమం సాగుతున్నా, 44 రోజులుగా అదానీ గంగవరం పోర్టు కార్మికులు పోరాడుతున్నా వీరికి కనిపించకపోవడం దారుణమన్నారు. ఎంతసేపూ ఆ మూడు పార్టీలూ వ్యక్తిగత విమర్శలతోనే సభలు, పర్యటనలు జరుపుతున్నాయన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్, మెట్రో రైల్, గిరిజన యూనివర్సిటీ వంటి హామీలను మోడీ ప్రభుత్వం నెరవేర్చకున్నా కేంద్రంపై ఒక్క విమర్శ లేకుండా ఉపన్యాసాలు చేయడమంటే బిజెపికి ఆంధ్ర రాష్ట్రాన్ని తాకట్టుపెట్టడం తప్ప మరొకటి కాదన్నారు. బిజెపి ప్రభుత్వానికి టిడిపి, వైసిపి, జనసేన ఉమ్మడిగా మద్దతు తెలపడాన్ని ఖండించారు. రాష్ట్రంలో గాజువాక మండలం తలసరి ఆదాయంలో అగ్రగామిగా ఉండడానికి స్టీల్‌ప్లాంట్, ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలే కారణమని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ ఐక్యంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో పోరాడాలన్నారు. అటువంటి పోరాటానికి సిపిఎం పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి కుమార్ పాల్గొన్నారు.

బంధువులకు భూములు

- నలుగురు రెవెన్యూ అధికారులు సస్పెండ్

ప్రజాశక్తి - మద్దిపూడి (ప్రకాశం)

విఆర్ఒ బంధువులకు అక్రమంగా భూములను రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో ప్రకాశం జిల్లా మద్దిపూడి తహశీల్దార్‌తో పాటు నలుగురు రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ గురువారం సస్పెండ్ చేశారు. మద్దిపూడి మండలం పన్నూరులోని సర్వే నంబర్109/1, 171/1, 172/2 ఇతర సర్వే నంబర్లలో 28 మందిని హక్కుదారులుగా, వారి వారసులుగా 91 మందిని పేర్కొంటూ వారి పేర్ల మీద పన్నూరు విఆర్ఒ డి.శివారెడ్డి ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేశారు. విజయవాడ-బెంగళూరు మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డుకు పోయే ఈ భూములను తన బంధువుల పేరు మీద శివారెడ్డి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కనిగిరి ఆర్‌డిఒను విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. మద్దిపూడి మండలం పన్నూరు గ్రామ సర్వేనంబర్ 12-2, 169-1తో పాటు ఇతర సర్వే నంబర్లలో మొత్తం 143 ఎకరాల 29 సెంట్ల పట్టా భూమికి అసలైన వారసులను కాకుండా ఫ్యామిలీ ట్రీ అనే ఓ పత్రం తయారు చేసి 65 మందికి పట్టాదారు పాసుపుస్తకాల కోసం శివారెడ్డి, ఆర్‌ఐ ఎంవిఎం శేషాచలం సిఫార్సు చేశారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించకుండా అప్పటి ఇన్‌చార్జీ తహశీల్దార్ ప్రస్తుత డిప్యూటీ తహశీల్దార్ అయిన జి.జగదీశ్వరరావు సదరు 65 మంది పేర్ల మీద పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయడానికి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత తహశీల్దార్ సిహెచ్.కృష్ణారావు ఆ భూముల్లో 71 ఎకరాల 75 సెంట్ల భూమిని శివారెడ్డి బంధువుల పేర్లు మీద వెబ్‌ల్యాండ్‌లో రిజిస్ట్రేషన్ చేయించారని జిల్లా కలెక్టర్‌కు కనిగిరి ఆర్‌డిఒ నివేదిక అందజేశారు. దీంతో మద్రిపూడి తహశీల్దార్ సిహెచ్ కష్ణారావు, పూర్వ తహశీల్దార్, ప్రస్తుత డిప్యూటీ తహశీల్దార్ జి.జగదీశ్వరరావును, ఇన్‌ఛార్జి ఆర్‌ఐ ఎంవిఎం శేషాచలం, విఆర్ఒ శివారెడ్డిలను జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ సస్పెండ్ చేశారు.

హానర్ హోమ్స్ నుంచి భారీ గేటెడ్ కమ్యూనిటీ

- రూ.3వేల కోట్లతో ప్రాజెక్ట్
- 18వ టవర్లలో 3266 నివాసాలు
- ఆ సంస్థ ప్రమోటర్ల వెల్లడి

హైదరాబాద్ : ప్రముఖ నిర్మాణ సంస్థ హానర్ హోమ్స్ రూ.3,000 కోట్లతో కొత్త ప్రాజెక్టును చేపడుతున్నట్లు వెల్లడించింది. కూకట్‌పల్లి ఐడిఎల్ చెరువు సమీపంలో 27.5 ఎకరాల్లో 'హానర్ సిగ్నాటిస్' నిర్మాణాన్ని చేపడుతున్నామని హానర్ ప్రమోటర్, డైరెక్టర్ ఎం బాలు చౌదరి తెలిపారు. మొత్తం 3266 నివాసాలు అందుబాటులోకి రానున్నా యన్నారు. గురువారం హైదరాబాద్‌లో నూతన ప్రాజెక్టు బ్రోచర్‌ను ఆ సంస్థ డైరెక్టర్లు బాలు చౌదరి, వెంకటేశ్వర్లు, వై స్వప్న కుమార్, ఎస్ రాజమౌళి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలు చౌదరీ మీడియాతో మాట్లాడతూ.. ఇది తమకు నాలుగవ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్ అని తెలిపారు. ఇప్పటికే 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు. గడిచిన రెండు ప్రాజెక్టుల్లో రూ.2,000 కోట్ల వ్యాపారం నమోదు చేశామన్నారు.



హానర్ సిగ్నాటీస్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ డైరెక్టర్లు బాలు చౌదరి, రాజమౌళి, వెంకటేశ్వర్లు, స్వప్న కుమార్.

హానర్ సిగ్నాటిస్ ప్రాజెక్ట్‌ను 18 టవర్లతో 3 లెవల్ పార్కింగ్, 26 అంతస్తులతో అందుబాటులోకి తేనున్నామన్నారు. ఇందులో 1695 నుంచి 3815 అడుగుల విస్తీర్ణంలో 3, 3.5, 4 పడక గదులతో నివాసాలను అభివృద్ధి చేయనున్నామన్నారు. ఆగస్ట్ 19న ఈ ప్రాజెక్టు శంకుస్థాపన జరగనుందని.. ఆఫర్‌లో చదరపు అడుగు ధర.7499గా నిర్ణయించామన్నారు. ఇప్పటికే 1200 ఫ్లాట్లకు అడ్వాన్స్ బుకింగ్‌లు వచ్చాయన్నారు.

నగరం మధ్యలో ఇదే అత్యంత పెద్ద ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. విశాలమైన 2 క్లబ్ హౌసులు, రెండు స్విమ్మింగ్ పూల్స్, 20వేల చదరపు అడుగుల్లో అతిపెద్ద జిమ్ సెంటర్. 5 ఎకరాల సెంట్రల్ పార్క్, వెహికల్ ఫ్రీ పోడియం లెవల్, ఇవి ఛార్జింగ్ స్టేషన్స్ తదితర సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. హానర్ సిగ్నటీస్‌కు పర్యావరణహిత ప్రాజెక్టుగా ఐజిబిసి ముందస్తు సర్టిఫికెట్ కూడా ఇచ్చిందన్నారు. తొలి దశ దాదాపు 50 శాతం ఫ్లాట్లు 2026 డిసెంబర్ నాటికి అందుబాటులోకి రానున్నాయన్నారు. 2027 ముగింపు నాటికి రెండో దశ పూర్తి కానుందన్నారు. నగరంలోనే మరో రెండు కొత్త ప్రాజెక్టులు చేపట్టే ప్రయత్నాల్లో ఉన్నామన్నారు. దాదాపు కోటి చదరపు అడుగుల్లో వీటిని చేపట్టనున్నామన్నారు.

తెలుగు ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేయాలి

- ఎపి మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూల్లో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కన్వీనర్ పి చంద్రశేఖర్, కో కన్వీనర్ ఎస్ బాలాజి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు ఉపాధ్యాయులు అంటే ప్రభుత్వాలు చులకన భావం చూపుతున్నాయని పేర్కొన్నారు. నిర్దాక్షిణ్యంగా తెలుగు ఉపాధ్యాయుల స్థాయిని తగ్గించి, ఆత్మన్యూనతాభావానికి గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ఉపాధ్యాయులతో సమాన స్థాయిని కలిగించి తెలుగు ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. 2018లో 164 మంది పిజిటి తెలుగు పోస్టులను టిజిటిగా ఎటువంటి కారణం లేకుండా డౌన్‌గ్రేడ్ చేశారని పేర్కొన్నారు. తద్వారా సైన్స్, ఇంగ్లీష్ తదితర అసంబద్ధమైన పోస్టులలో పనిచేయాల్సి వచ్చిందని వివరించారు.

సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోస్ట్ అప్‌గ్రేడ్ చేయాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సంఘాలు ఐదేళ్లుగా తిరుగుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఈ విషయంపై కనీసం ప్రతిపాదనలు కూడా తయారు చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మేల్కొని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మేలు కలిగించేలా పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థ లేని విధానాన్ని తెస్తామని, కాంట్రాక్టు ఉద్యోగులను, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు కేవలం 2014కు ముందున్న వారికే రెగ్యులర్ అనే నిబంధన పెట్టడం తగదని అన్నారు. ఈ విధానంతో కేవలం 10,177 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు మాత్రమే లబ్ధిచేకూరుతుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య రాష్ట్రంలో వున్న మూడు లక్షల మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థల్లోని కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే టైమ్‌స్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు.

పంచాయతీ నిధుల మళ్లింపుపై చర్యలు తీసుకోండి

గవర్నరుకు బిజెపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇవ్వకుండా అక్రమంగా మళ్లించిన అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బిజెపి డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్‌ను గురువారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి, నాయకులు సత్యకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, మాధవ్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు రూ.8 వేలకోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో మళ్లించిందన్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కొంతమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. గడిచిన నాలుగేళ్లలో రూ.7.44 లక్షల కోట్లు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకెళ్లిన అంశాలను గవర్నరు దృష్టికి తీసుకెళ్లామన్నారు.

ఆహారం వికటించి అక్కాతమ్ముడు మృతి

ప్రజాశక్తి- కారంపూడి (పల్నాడు జిల్లా)

ఆహారం వికటించి అక్కాతమ్ముడు మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా కారంపూడి మండలంలో చోటుసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... చినగార్లపాడు గ్రామానికి చెందిన చల్లా రామయ్య (36) ఇంటికి వివాహిత అయిన ఆయన సోదరి ఇర్ల కోటమ్మ (38) తన కుమార్తెను తీసుకుని దాచేపల్లి నుండి గత మంగళవారం వచ్చారు. రామయ్య బయట నుంచి తెచ్చిన భోజనాన్ని అదే రోజు మధ్యాహ్నం వీరంతా కలిసి తిన్నారు. సాయంత్రానికి కోటమ్మ, రామయ్య, ఆయన పిల్లలు గోపీచందు, లోకేష్ వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులంతా స్థానిక ఆర్ఎంపి వద్ద చికిత్స పొందారు. అయినా, ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం కోటమ్మ, రామయ్య ఒకరి తర్వాత ఒకరు మృతి చెందారు. దీంతో, గ్రామంలో కలకలం రేగింది. అస్వస్థతతో ఉన్న రామయ్య ఇద్దరు కుమారులను తొలుత పిడుగురాళ్లకు, అనంతరం నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కరాలపాడు పిహెచ్‌సి వైద్యులు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆహారం వికటించడం వల్లే మృతి చెంది ఉంటారని పిహెచ్‌సి వైద్యాధికారి నాగిరెడ్డి చెప్పారు.


కోటమ్మ (ఫైల్)


రామయ్య మృతదేహం

కృష్ణారావు మృతికి సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సీనియర్ జర్నలిస్ట్ కృష్ణారావు మృతికి మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు ప్రభృతులు సంతాపం వ్యక్తం చేశారు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో ఎపి రాష్ట్ర సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎపి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఉన్నారు.

పాత్రికేయ రంగానికి తీరని లోటు

కృష్ణారావు మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, ఎన్ఎజె నాయకులు ఎన్.కొండయ్య, ఎ.అమరయ్య, ఎపిబిజెఎ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.మునిరాజు, వి.శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టు వి.సురేష్ ఒక ప్రకటనలో తమ సంతాపాన్ని ప్రకటించారు.

సంపాదకీయం

అయ్యో హిమాచల్ !

భారీ వర్షాలు, వరదలు హిమాచల్ ప్రదేశ్‌ను వణికిస్తున్నాయి. కొండ చరియలు ఎక్కడికక్కడ విరిగి పడుతున్నాయి. ఇళ్లు పేక మేడల్లా కూలిపోతున్నాయి. ఈ ఏడాది వర్షాకాలంలో 150 మంది ప్రాణలు కోల్పోగా ఈ వారంలోనే సుమారు 60 మంది మరణించారు. ఆచూకి తెలియని వారింకెందరో! లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. నదులు, వాగులు పొంగుతుండటంతో పలు ప్రాంతాల్లో రైల్వే లైన్లు కొట్టుకుపోయాయి. ఈ వర్షా కాలం ప్రారంభమైన తరువాత ఇప్పటివరకు 9,600 ఇళ్లు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసం కాగా పది వేల కోట్ల రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. 170 వరకూ కొండచరియలు విరిగిపడిన, పిడుగులు పడిన ఘటనలు జరిగినట్లు, రాజధానికి పోయే ప్రధాన రహదారితో పాటు 621 రోడ్లు దెబ్బతిన్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా 752 రోడ్లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. వాస్తవంలో నష్టాలు అధికారిక లెక్కలకన్నా అధికంగా ఉంటాయన్నది జగమెరిగిన సత్యం. కష్టాలు, కన్నీళ్ల నడుమ కొట్టుమిట్టాడుతున్న హిమాచల్ ప్రజానీకాన్ని ఆదుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సకల చర్యలూ చేపట్టడం ఎంతో అవసరం. ప్రాణాలరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్న బాధితులకు భరోసా కల్పించడం పరిపాలకుల బాధ్యత. ఇందుకు రాజకీయ విభేదాలు అడ్డు కారాదు.

అభివృద్ధి పేరిట విచక్షణా రహితంగా భారీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల ఏర్పాటు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం, అందుకోసం కొండలను తొలిచేయడమే ఇంతటి విధ్వంసం జరగడానికి ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇదేదో ఇప్పటికిప్పుడు అంటున్న మాట కాదు. దశాబ్దాల కిందటనే పలు పరిశోధనలు గావించిన భూగర్భ, భూభౌతిక శాస్త్రవేత్తలు నిర్ద్వంద్వంగా నిగ్గు తేల్చారు. ఆ మాటకొస్తే కేవలం హిమాచల్ ప్రదేశ్‌కు మాత్రమేగాక హిమాలయ సాణువుల్లోని ఇతర రాష్ట్రాలకూ ఈ ప్రమాదముందని వారు హెచ్చరించారు. అయినా అభివృద్ధి పేరిట ఆకాశ హర్మ్యాల నిర్మాణానికి ప్రభుత్వాలు అనుమతులిచ్చాయి. జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం ఒకవైపున కొండలను తొలిచేయడం, మరోవైపు నిర్మాణ వ్యర్థాలను ఆ నదుల్లోనే కలిపేసి ప్రవాహాలకు ఆటంకాలు కల్పించడం యథేచ్ఛగా సాగిపోతోంది. ఈ అంశాలపై హిమాచల్ హైకోర్టు గత ఏడాది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తలంటింది కూడా! హిమాలయాల్లో ఇప్పటికి 168 జల విద్యుత్ కేంద్రాలుండగా 2030 నాటికి 1,088 కేంద్రాలు రానున్నాయని ఏలినవారు గొప్పగా చెబుతుండడం వారి నిర్లక్ష్య ధోరణికి పరాకాష్ట.

హఠాత్తుగా భారీ వర్షాలు, ఫలితంగా ఆకస్మిక వరదలు సంభవించడానికి పర్యావరణ మార్పులు ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు. వాతావరణ పర్యవసానాల మూలంగా హిమాలయాలు, భారత కోస్తా ప్రాంతాలకు గట్టి దెబ్బ తగుల్తుందని ఐపిసిసి 6వ నివేదిక స్పష్టం చేసింది. ఈ ఏడాది అసాధారణంగా కురుస్తున్న వర్షాలు అది నిజమని నిర్ధారించాయి. పర్యావరణ మార్పులు ఇంత తీవ్రంగా జరగడానికి అభివృద్ధి పేరిట విచక్షణా రహితంగా ప్రకృతిపై దాడి చేయడమే కారణం. భౌగోళిక పరిస్థితులకు, స్థానిక ప్రజల అవసరాలకు తగిన రీతిలోనే అభివృద్ధి ప్రణాళికలుండాలి తప్ప కార్పొరేట్ల లాభాపేక్ష కోసం పర్యాటక ప్రాజెక్టులు, భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపట్టడం వినాశనానికే దారి తీస్తుంది. వేల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన నాలుగు లైన్ల మనాలి హైవేలో 40 శాతం కేవలం రెండు రోజుల్లోనే ధ్వంసమైన తీరు చూసిన తరువాతయినా పాలకులు కళ్లు తెరవాలి. హిమాలయ పర్వత ప్రాంతాలు, వాటి సాణువుల్లో ఎలాంటి నిర్మాణాలైనా పర్యావరణ పరిరక్షణకు హితమైన రీతిలో మాత్రమే జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు ఇకనైనా చేపట్టాలి. మల్టీ డిసిప్లినరీ నిపుణుల బృందాలు చర్చించి శాస్త్రీయంగా అటువంటి విధానాన్ని రూపొందించాలి. ప్రజల ప్రయోజనం కాపాడడం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఉండాలి. ప్రభుత్వాల ఆలోచనా సరళి, విధాన రూపకల్పనకు అవే పరమావధి కావాలి.

మహనీయుల మాట



ఎట్టి పరిస్థితులలోనూ, ఏ విషయానికన్నా పార్టీ ప్రయోజనాలే మిన్నగా భావించడమే ప్రతి పార్టీ సభ్యుని విప్లవ నైతికతకు గీటురాయిగా నిలుస్తుంది.

- హోచిమిన్

దళిత క్రైస్తవులు - సమాజం, చర్చి, ప్రభుత్వం నుండి వెలివేత!

విశ్లేషణ





క్లైమెంట్ అరోకియా సామి

దళిత క్రైస్తవులకు షెడ్యూల్ కులం (ఎస్‌సి) హోదాను మంజూరు చేసేందుకు గల అవకాశాలను అధ్యయనం చేసేందుకు భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి కె.జి.బాలకృష్ణన్ నేతృత్వంలో గతేడాది భారత ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇటీవలే, ఇందుకు సంబంధించి 1950 నాటి రాష్ట్రపతి (ఎస్‌సి) ఉత్తర్వులను సవరిస్తూ తమిళనాడు అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. క్రైస్తవ మతానికి మారిన దళితులు ఎస్‌సి కోటా కింద రిజర్వేషన్ ప్రయోజనాలు పొందేందుకు అనుమతించాలంటూ జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ (2007) సిఫార్సు చేసింది. 'దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదాను తిరస్కరించడాన్ని సమర్ధించేందుకు బలమైన సాక్ష్యాధారాలు లేవు' అని జాతీయ మైనారిటీల కమిషన్ నియమించిన దేశ్‌పాండే, బప్నా (2008)లు నిర్ధారించారు.

"అస్పృశ్యులకు సంబంధించినంతవరకూ హిందూ మతం ఒక ఘోరాల కోట. (రచనలు, ప్రసంగాలు, వాల్యూమ్ 9, పేజీ 296)" అని బి.ఆర్ అంబేద్కర్ చెప్పారు. ఈ భయానకమైన వివక్ష నుండి తప్పించుకోవడానికే లక్షలాదిమంది హిందూ దళితులు క్రైస్తవంతో సహా మరింత సమానతతో కూడిన మతాలకు మారిపోయారు. హిందూ మతంలోని కులతత్వ సంకెళ్ళ బారి నుండి తప్పించుకుని, అటువంటి మతాలు హామీ ఇచ్చిన సమానత్వాన్ని అనుభవించాలనే ఆశతోనే వారు మారిపోయారు. హిందూ దళితులు క్రైస్తవానికి మారడానికి గల ప్రధాన కారణం - సమానత్వమనే ప్రాథమిక ఆశ - అయితే అది చాలా వరకు సాకారమవనే లేదు. ఇప్పుడు ఈ వ్యాసం యొక్క మౌలిక వాదన దాని గురించే. మతం మారిన ఫలితంగా వారి గుర్తింపునకు సంబంధించి అనేక వైరుధ్యాలు, అనిశ్చితులు, అస్పష్టతలు నెలకొన్నాయి. పైగా సామాజిక చలనశీలత క్రమంలో ఆశించినట్లుగా వారు పైకి ఎగబాకలేకపోయారు. శతాబ్దాల తరబడి ఆచరిస్తూ వచ్చిన సాంప్రదాయం అస్పృశ్యతను సమాజం నుండి పారద్రోలడానికి, దీన్ని చర్చిలోకి తీసుకురావడానికి సహ మతవాదులు, క్రైస్తవంలోకి మారిన దళితయేతరుల విముఖత కూడా ఇందుకు కారణంగా వుంది.

వర్గాలవారీ విభజన భారాలు

దళిత క్రైస్తవుల సమస్యను 'ఇంటర్‌సెక్షనల్ థియరీ' (అనేక వివక్షలు, ప్రతికూలతల వల్ల ప్రభావితమైన ఒక వ్యక్తి, సమూహం, లేదా సామాజిక సమస్యను గురించి ఒక అభిప్రాయాన్ని లేదా భావనను రూపొందించడమే థియరీ ఆఫ్ ఇంటర్‌సెక్షనాలిటీ) మరింత విస్తృతంగా చూపిస్తోంది. మతంతో కులానికి గల అవగాహనకు, దళితులుగా, మతపరమైన మైనారిటీ గ్రూపుగా దళిత క్రైస్తవులను చూసే సంక్లిష్టమైన అవగాహనకు అనుమతిస్తోంది. ఏకాకులైన కేటగిరీలకు చట్టపరమైన రక్షణను కల్పించే, దళిత క్రైస్తవులు వంటి వర్గాలు అతిగా వ్యాప్తి చెందుతున్న గ్రూపులకు వ్యతిరేకంగా వివక్షను ప్రదర్శించే భారత దేశ చట్టాల 'సింగిల్ యాక్సిస్ ఫ్రేమ్‌వర్క్' అసమర్ధతకు సంబంధించిన అవగాహనను కూడా ఇది వివరిస్తుంది.

జాతి, లింగం, లైంగికత, సమర్ధత వంటి వివిధ అణచివేత వ్యవస్థలను మరొకదాని నుండి వేరుగా అర్థం చేసుకోలేమని ఇది చెబుతోంది. ఇటువంటి అధికార వ్యవస్థలు పరస్పరం ఖండించుకుంటూ విలక్షణమైన వ్యక్తిగత సామాజిక అనుభవాలకు దారితీస్తున్నాయి. వివిధ వర్గాల మధ్య నెలకొన్న ఇటువంటి వివక్షకు సంబంధించిన పర్యవసానాలే ఈ వివక్షను ప్రత్యేకంగా ఎత్తి చూపుతున్నాయి. థియరీ ఆఫ్ ఇంటర్‌సెక్షనాలిటీకి ఆద్యులైన కింబర్లీ క్రెన్షా దీన్ని ప్రవేశపెట్టారు.

"మేపింగ్ ది మార్జిన్స్ : ఇంటర్‌సెక్షనాలిటీ, ఐడెంటిటీ పాలిటిక్స్, అండ్ వయొలెన్స్ అగైనెస్ట్ విమెన్ ఆఫ్ కలర్" అన్న శీర్షికతో తన వ్యాసంలో ఆమె ఇలా రాశారు, "తరగతుల వారీ గుర్తింపుల కారణంగా మహిళలు, నల్లజాతి మహిళలు వారి పరిధుల్లో పక్కకు నెట్టివేయబడుతున్నారు." దళితులు, క్రైస్తవులను, వ్యవస్థాగతంగా వర్గాల మధ్య వివక్షకు గురవుతూ తద్వారా సమాజం, చర్చి, ప్రభుత్వం నుండి వెలివేయబడుతున్న దళిత క్రైస్తవులుగా అధ్యయనం చేయడానికి ఒక ఫ్రేమ్‌వర్క్‌గా ఇంటర్‌సెక్షనాలిటీ అవగాహనను ప్రాతిపదికగా చేసుకోవడానికి ఈ వ్యాఖ్యానం సహాయపడుతుంది.

సాధారణ వాడుకలో చెప్పాలంటే దళిత క్రైస్తవులనేది పరస్పర విరుద్ధమైన రెండు పదాల కలయికగా పరిగణించబడుతుంటుంది. క్రైస్తవ మతం కులాల తేడాను గుర్తించదు గనక హిందూ మతంలో దళితుడు... ఆ మతంలోకి మారిన వేంటనే దళితుడుగా వుండబోడన్న మాట. దళిత క్రైస్తవుల విషయంలో భారత ప్రభుత్వ కచ్చితమైన అభిప్రాయం ఇదే. మత మార్పిడి జరిగిన తర్వాత దళిత క్రైస్తవులకు సంబంధించిన వైకల్యాలన్నీ కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం వారిని కేవలం క్రైస్తవులుగానే చూస్తోంది. దీంతో వారిని 'తరగతులవారీ విభజనల్లో అదృశ్యం' అనే కేటగిరీ లోకి నెట్టేస్తున్నారు.

'గుర్తింపు అనేది సమాజంలో ఉనికిలో వున్న వివిధ సామాజిక తరగతులకు సంబంధించిన నిర్దిష్ట, ప్రత్యేక సామాజిక తరగతుల గుర్తింపులతో వ్యక్తికి వుండే సభ్యత్వం గురించి చెప్పుకోవడం. వాస్తవానికి స్వీయ గుర్తింపుల్లో ఇవి ఉపకరణాలుగా వుంటాయి.

'నల్ల జాతి మహిళ' విషయంలో మాదిరిగానే 'దళిత క్రైస్తవుడు' అనే పదాన్ని కేవలం రెండు పదాల జోడింపుగా అర్థం చేసుకోలేం. దాన్నొక విలక్షణమైన కేటగిరీగా గుర్తించాల్సి వుంది. ఎందుకంటే ఈ తరగతి బహుళ సామాజిక గుర్తింపుల ప్రత్యేక హైబ్రీడ్ సృష్టిగా వుంది. సాధారణ వాడుకలో చెప్పాలంటే దళిత క్రైస్తవులనేది పరస్పర విరుద్ధమైన రెండు పదాల కలయికగా పరిగణించబడుతుంటుంది. క్రైస్తవ మతం కులాల తేడాను గుర్తించదు గనక హిందూ మతంలో దళితుడు...ఆ మతంలోకి మారిన వేంటనే దళితుడుగా వుండబోడన్న మాట. దళిత క్రైస్తవుల విషయంలో భారత ప్రభుత్వ కచ్చితమైన అభిప్రాయం ఇదే. మత మార్పిడి జరిగిన తర్వాత దళిత క్రైస్తవులకు సంబంధించిన వైకల్యాలన్నీ కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం వారిని కేవలం క్రైస్తవులుగానే చూస్తోంది. దీంతో వారిని 'తరగతులవారీ విభజనల్లో అదృశ్యం' అనే కేటగిరీ లోకి నెట్టేస్తున్నారు. అమర్త్యసేన్ దీన్ని 'సామూహిక' గుర్తింపులుగా వివరించారు. ఒక వ్యక్తి ఆ సమూహానికి చెందవచ్చు, ప్రత్యేక గుర్తింపు కల్పించవచ్చు, ఆ గుర్తింపు వివిధ సందర్భాల్లో వివిధ కాలానుగుణ్యతలకు తగ్గట్టుగా మారుతుంది. 'ఈ గుర్తింపులకు ఇచ్చే ప్రాధాన్యతలు తప్పనిసరిగా మన సమస్యకు అనుగుణంగా వుండాలని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి బహుళ గుర్తింపుల నుండి ప్రాధాన్యమైనదాన్ని ఒక వ్యక్తి ఎంపిక చేసుకుని, ప్రయోజనాలు పొందవచ్చునని అన్నారు.

సింగిల్ యాక్సిస్ ఫ్రేమ్‌వర్క్

సూసై ఎట్‌సెట్రా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా అండ్ అదర్స్ కేసు (1985)లో, చెప్పుల తయారీదారుడైన దళిత కేథలిక్ సూసై మద్రాసు ప్లాట్‌ఫారమ్ మీద తన బడ్డీని విస్తరించుకోవడం కోసం సుప్రీంను ఆశ్రయించాడు. హిందువులైన చెప్పుల తయారీదారులతో సమానంగా తనకు కూడా అవకాశం కల్పించాలని కోరాడు. కానీ కోర్టు ఆ కేసును కొట్టివేసింది. "హిందూ మతంలోని సామాజిక వ్యవస్థలో ఇటువంటి కులానికి చెందినవారు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులన్నీ భిన్నమైన మతపరమైన కమ్యూనిటీలో కూడా ఇలాగే కొనసాగుతున్నాయని నిర్ధారించడం అవసరం" అని పేర్కొంది. అంటే సింగిల్ యాక్సిస్ ఫ్రేమ్‌వర్క్ దృక్పథాన్ని ఉపయోగించి సూసై దళితుడనే వాదన ఇక్కడ పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది.

హిందూమతం, సిక్కుమతం, బౌద్ధమతంలో కూడా కులాలవారీ వివక్ష భావన నెలకొందని, అందుకే దళితులకు ప్రయోజనాలు అందించాలని భారత రాజ్యాంగం భావించిందని ఆశిష్ నాండే వాదించారు. కానీ, క్రైస్తవమనేది విదేశాల నుండి దిగుమతి అయిన మతం అన్న భావన ప్రాతిపదికన దళిత క్రైస్తవులను మినహాయించిందని, తద్వారా వారి ప్రజాస్వామ్య పౌరసత్వమనేది ప్రశ్నార్థకమైందని అన్నారు.

అందువల్ల, దళిత క్రైస్తవులకు అనుకూలంగా చాలా సాక్ష్యాధారాలు వున్నప్పటికీ ప్రభుత్వం విముఖంగా వుండడంతో దళిత క్రైస్తవులను ఎస్‌సి జాబితాలో చేర్చడంలో చట్టంలోని సింగిల్ యాక్సిస్ ఫ్రేమ్‌వర్క్ విఫలమైంది. దళిత క్రైస్తవులను ఎస్‌సి జాబితాలోకి చేర్చాలంటే 1950 నాటి రాష్ట్రపతి (ఎస్‌సి) ఉత్తర్వులను సవరించడమే ప్రస్తుతం మన ముందున్న మార్గం.

(వ్యాసకర్త బ్రిటన్ లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో పని చేస్తున్నారు)
'ది హిందూ' సౌజన్యంతో

సెటైర్

పక్షిరాజా పరిపాలన

సముద్రపొడ్డున ఉన్న శిలలను చూసి ఇన్ని రాళ్ళు, ఇంత పెద్ద బండలు ఇక్కడెందుకున్నాయి? సముద్రంలో శిలలేమిటి బామ్మా? అనడిగిందొక మనవరాలు తన బామ్మని.

ఆ ముసలమ్మ చెప్పిందట కదా...

అనగనగా ఒకప్పుడొక రాజుండేవాడట, అతని పేరు పక్షిరాజట, రాజదండాన్ని ధరించి, ఛాతీ పొంగించి తన మాటే శాసనమనేవాడట. రాత్రే ఎందుకు నిద్రపోవాలి, పగలే ఎందుకు పనులు చేయాలి? ఇకపై నా రాజ్యంలో రాత్రులు పగళ్ళుగా, పగళ్ళు రాత్రులుగా విధులు నిర్వహించాలి ప్రజలు అని చట్టం చేసేడట.

సప్తవర్ణశోభలతో విరిసే ఇంద్రధనుస్సును చూసి ఆకాశంపై ఆగ్రహాన్ని ప్రకటించేడట.

అన్ని రంగుల్లో కాకుండా ఒకే రంగులో ఉండాలనీ, ఒంపు లేకుండా తిన్నగా ఉండాలనీ

కమ్మరులను పిలిపించి సమ్మెటలు పట్టించి హరివిల్లును సాగదీయమన్నాడట.

అది తమ వల్లగాదన్న ఆ వృత్తి కళాకారుల్ని బంధిఖానాలో పెట్టించేడట.

వృక్షాలన్నీ ఒకే ఎత్తులో ఉండాలనీ చెట్లన్నీ ఒకే రంగులో పూలు పూయాలనీ అడివిని శాసించేడట.

మిత్రులకు కొండల్ని కానుక చేసి వారు ఖనిజాల కోసం వాటిని నేలమట్టం చేయడానికి ఖజానా నుండి రుణ సదుపాయం కల్పించేడట.

కాకి, కోకిల, చిలక, నెమలి సమస్త పక్షిజాతీ ఒకే పాటను ఒకే గొంతుతో ఒకేలా పాడాలనీ

పక్షులకు పలు రంగుల ఈకలు కాదు ఒకే రంగులో ఉండాలనీ అడవి పక్షులన్నిటికీ ఒకే రంగు పూయించే పని పెట్టేడట చిత్రకారుల్ని పిలిపించి.

ఇదెలాసాధ్యమన్న చిత్రకారులను చెరసాలలో పెట్టించేడట.

పిట్టలు స్వేచ్ఛగా విహరించడం అతనికి సహించక

ఆకాశంలో ఎగరనీయకుండా వాటి రెక్కలకు రాళ్ళను వేలాడదీయమన్నాడట.

అది తెలిసే పిట్టలు ఎటో ఎగిరిపోయేయట భయంతో.

పిట్టలు లేని లోకంలో ఎలా జీవించాలో తోచని చెట్లు దు:ఖంతో తలలు వాల్చేసేయట.

ఆకులన్నీ ఉన్నది ఒక రంగులోనే అయినప్పుడు

పూలకు పలు వర్ణాలెందుకు? వేరు వేరు పరిమళాలెందుకు?

పూలన్నీ ఒకే రంగు ఒకే పరిమళంతో పూయాల్సిందే

అని హుకుం జారీ చేసేడట.

అసలు

మనిషికీ మనిషికీ రూపురేఖల్లో ఇంత వ్యత్యాసమెందుకు.

అందరిదీ ఒకే రూపమైతే అదే సమత్వమని

జనం ముఖాలకు తన ముఖరూప మాస్కులను తయారు చేయించి వాటిని ముఖాలకు తగిలించుకు తిరగమన్నాడట.

ఇన్ని వృత్తులా? ఇన్ని వేషాలా? భిన్న భాషలా? లాభం లేదు, ఒకే వృత్తి, ఒకే వేషం, ఒకే భాష ఇదే నా రాజ్యంలో ప్రత్యేకత అని గడ్డం దువ్వుకున్నాడట.

వైవిధ్యాన్ని బహిష్కరించాలని శాసనం చేసేడట.

అంగీకరించని వారిని రాజద్రోహులని ముద్ర వేసేడట.

ఒకే వేషం, ఒకే భాష, ఒకే వర్ణం, ఒకే రాగం, ఒకే రాజ్యం

అని వికటాట్టహాసం చేస్తుంటే...

రాజుకు మతి చలించిందని ప్రకటించేరట సాహసించిన రాజవైద్యులు.

ఒకరోజు రాజు సముద్రపొడ్డున నిలబడి తన పాదాలు కడగమని సముద్రాన్ని ఆదేశించేడట.

సముద్రుడు రాజుగారి రెండు పాదాల్నీ పట్టి లోపలికి లాక్కుపోయేడట ప్రక్షాళన చెయ్యడానికి.

రాజావారొస్తారని అతని మూర్ఖ భక్తులు ఎదురు చూసీ చూసీ శిలలై పోయారట ఒడ్డునే.

ఇప్పుడు మనకు కనిపిస్తున్నవి ఆ శిలలే...

అని మనవరాలికి చెప్పి కథ ముగించింది బామ్మ.


- గంటేడ గౌరునాయుడు

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

మతం ఊతకర్రల్ని దోపుకొని వచ్చిన 'దేశభక్తి'



డా|| దేవరాజు మహారాజు



జాతుల మధ్య, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ఓట్ల కోసం కుట్రలు చేసే పాలకులు... మతాన్ని దోపుడు కర్రలుగా చేసుకుని, ప్రభుత్వాన్ని నడిపిస్తూ ఉంటే ఏమనుకోవాలి? అదొక వికలాంగ ప్రభుత్వమనుకోవాలి! మతం వేరు-ప్రజాస్వామ్యం వేరు అని పాలకులు గ్రహించినప్పుడు కదా మళ్ళీ దేశ ఆరోగ్యం పునరుద్ధరించబడేదీ?

పశ్చిమ బెంగాల్, ఝర్‌గ్రాంలో 1940 మే12న జరిగిన బహిరంగసభలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ దేశ ప్రజలనుద్దేశించి చెప్పిన మాటల్ని మనం ప్రస్తుత పరిస్థితుల్లో గుర్తు చేసుకోవాల్సి ఉంది. "హిందూ మహాసభ తమ సన్యాసులను, సన్యాసినులను తెచ్చి, పెద్ద ఎత్తున రాజకీయాల్లో ప్రవేశపెట్టింది. వారు ఓట్లు అడుగుతూ తిరుగుతున్నారు. వారు కనబడగానే హిందువులంతా ఒక పవిత్ర భావనకు లోనై, శిరస్సు వంచి నిలబడుతున్నారు. హిందూ మహాసభ వారికి బాగా ఉపయోగపడుతూ ఉంది. హిందువులంతా ఈ విషయాన్ని ఖండించాలి. ఆధ్యాత్మికవాదులకు రాజకీయాలతోనూ, ఓట్లతోనూ పనేమిటీ? మత విశ్వాసాలు తెచ్చి రాజకీయాలకు పులమడం వల్ల, ఇప్పుడే కాదు, రాబోయే కాలాలలో కూడా చాలా ప్రమాదాలు జరుగుతాయి. ప్రజలందరూ దీన్ని గుర్తించాలి. అప్రమత్తంగా ఉండాలి. ఏ మతమైనా సరే, దాని పరిధిలో దాన్ని ఉండనివ్వాలి. అతిక్రమిస్తే మాత్రం సహించకూడదు". దార్శనికుడైన నేతాజీ, ఎనభైయేళ్లకు ముందే నేటి సమకాలీన పరిస్థితిని పసిగట్టారు. ఒకప్పటి హిందూ మహాసభ ఇప్పుడు లేదని అనుకోవద్దు. ఆర్‌ఎస్‌ఎస్-బిజెపిలు దాని శాఖలే!

సిఎన్‌ఎన్-పోల్ ప్రపంచంలోని అత్యంత అవినీతి మయమైన పది రాజకీయ పార్టీల జాబితాను విడుదల చేసింది. అందులో మన దేశంలోని అధికార పార్టీ భారతీయ జనతా పార్టీకి నాలుగోస్థానం లభించింది. దేశంలో బిజెపి వారు చేస్తున్న అరాచక కార్యక్రమాలు రోజూ మీడియాలో చూస్తూనే ఉన్నాం. మీడియాను మోడీ ఎంతగా కొనేసినా ఇంకా నిజాలు నిర్భయంగా వెల్లడిస్తున్న వారు కొంత మందైనా ఉన్నారు. ఉత్తరప్రదేశ్ అయోధ్యలో అల్లర్లు సృష్టించిన ఏడుగురు బిజెపి కార్యకర్తల్ని సి.సి. ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరు ముస్లిం టోపీలు ధరించి, ముస్లింల వేషధారణలో అయోధ్యలోని మసీదు వెలుపల అభ్యంతరకరమైన పోస్టర్లు అంటించారు. ఖురాన్ ప్రతుల్ని విసిరేశారు. ముస్లింలను నిందిస్తూ, ముస్లింలను దోషులుగా ప్రచారం చేస్తూ ముస్లింల వేషధారణలో అల్లర్లకు పాల్పడింది బిజెపి కార్యకర్తలేనన్నది స్పష్టమైంది.

గడ్డం పెంచుకున్నంత మాత్రాన ఎవరూ రవీంద్రనాథ్ టాగూర్ అయిపోరు. అలాంటప్పుడు మరి ఇతనేనా మన విజయవంతమైన ప్రధానమంత్రీ? సర్దార్ పటేల్ విగ్రహానికి మూడు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాడు. కార్పొరేట్లకు అయిదు లక్షల యాభై అయిదు వేల కోట్లు రుణమాఫీ చేశాడు. ప్రధాని తన విదేశీ యాత్రలకు 25 వేల కోట్లు, బిజెపి పార్టీ ఆఫీసుకి రూ.350 కోట్లూ, తమ పార్టీ వ్యాపార ప్రకటనలకు 500 కోట్లు, ప్రధాని సెక్యూరిటీకి 591 కోట్ల 30 లక్షల ఖర్చు వస్తూ ఉంది. గడచిన ఐదేళ్లలో కుంభమేళాలకు 500 కోట్లు, ట్రంప్‌కు నమస్కారం చెప్పడానికి వందకోట్లు ఖర్చు చేశాడు. ఇతని వల్లనే కదా ద్రవ్యోల్బణం పెరిగిందీ? ఇతని వల్లనే కదా పెట్రోల్, డీజిల్, గ్యాసు సిలిండర్ ధరలు ఊహించలేనంతగా పెరిగాయి? గడచిన 30-40 సంవత్సరాలలో ఏనాడూ ఇంతమంది సైనికులు చనిపోలేదు. ఈయన గారి అధ్వాన్నపు పాలన ఎలా ఉందో చెప్పడానికి ఇంకా ఎన్ని ఉదాహరణలు కావాలీ? అంటూ ప్రతిపక్ష నేతలు పార్లమెంట్‌లోనే అనేకసార్లు గగ్గోలు పెట్టారు. సంసద్ టి.వి, ఇతర జాతీయ టెలివిజన్ చానళ్ళ ద్వారా దేశ ప్రజలు అన్నీ గమనిస్తూ వచ్చారు. అక్కడ ప్రతిపక్షాలు తమ 'మన్ కి బాత్' గొంతెత్తి చెపుతున్నాయని అనుకున్నారు. ప్రత్యక్ష ప్రసారం చేసింది సంసద్ టి.వి.యే గనక, అది అధికార ప్రకటననే-అని దేశ ప్రజలు భావించారు!

కర్ణాటకలో విద్వేష ప్రసంగాలకు బిజెపి నాయకులు ఆజ్యం పోస్తున్నారు. కర్ణాటక బిజెపి చీఫ్ నళిన్ కుమార్ కాతిల్ - "టిప్పు సుల్తాన్ అభిమానులు ఈ దేశంలో ఉండటానికి వీలులేదు. వారిని వెంటాడి వేటాడి చంపేయండి. లేదా అడవి ప్రాంతాలకు పారద్రోలండి. మనం హిందువులం శ్రీరాముడి భక్తులం!" అంటూ కర్ణాటకలోని కొప్పాల్ జిల్లాలోని యెల్‌బుర్గాలో ఈ విద్వేష ప్రసంగం చేశాడు. ఫలితంగా కర్ణాటక ప్రజలు తమ తీర్పునిచ్చారు. ఎవరిని పారదోలాలన్నది బహుశా వారికి తెలిసినట్టుంది! ఆంగ్లేయులను ఎదిరించి పోట్లాడిన భారతీయ పాలకుడు టిప్పు సుల్తాన్‌ను వీరు దేశద్రోహి అని అంటారు. ఎందుకూ? అంటే - అతను ముస్లిం రాజు కాబట్టి! ఆంగ్లేయుల బూట్లు నాకి క్షమాభిక్ష అడుక్కున్న సావర్కర్ వీరి దృష్టిలో గొప్ప దేశభక్తుడు. ఎందుకూ? హిందూ మహాసభ / ఆరెస్సెస్ / బిజెపిల సభ్యుడు గనక! గాంధీని హత్య చేసిన గాడ్సేకు వెనక ఉన్నది సావర్కరేనన్న విషయం కావాలనే దాచిపెడతారు.

ఉత్తర ప్రదేశ్ అమేథికి చెందిన మహమ్మద్ ఆరిఫ్ కొన్నేళ్ళ క్రితం తన పొలంలో గాయపడి పడిపోయిన 'సారస్' రకం కొంగకు చిన్నపాటి కట్టుగట్టి వైద్యం చేసి కాపాడాడు. అలా ఆ కొంగ అతని దగ్గరే ఉండిపోయింది. అటవీశాఖ అధికారులు వచ్చి ఆ కొంగను స్వాధీనం చేసుకుని సమస్‌పూర్ పక్షుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. అంతవరకు బాగానే ఉంది. కానీ ఆరిఫ్‌పై అధికారులు కేసు నమోదు చేయడం వివాదాస్పదమైంది. పక్షి ప్రాణాలు కాపాడినందుకు బిజెపి ప్రభుత్వం ఆరిఫ్‌పై కేసు పెట్టింది. కారణం మరేమీలేదు, అతను ముస్లిం కావడమే. అలా కేసులు పెడితే పెద్ద పెద్ద వాళ్ళ మీదే పెట్టాలి. ప్రధాని మోడీ తన నివాసంలో నెమళ్ళు పెంచుకుంటే కేసు ఉండాలి కదా? అలాగే యూపీ ముఖ్యమంత్రి యోగి తన కార్యాలయంలో పనిచేస్తూ ఉండగా, ఆయన ఒళ్ళో బుల్లి కోతి వచ్చి కూర్చుంటుంది. ఆయన దాన్ని ఆడిస్తూ ఉంటాడు. ఆయన మీద కేసు ఉండాలి కదా? వీళ్ళు ఆ జంతువుల / పక్షుల గాయాలు మాన్పలేదు. ఆరోగ్యంగా ఉన్నవాటినే పెంచుకుని ఆడుకుంటున్నారు. అటవీ చట్టం ప్రకారం అడవి జంతువుల్ని బలవంతంగా ఇంట్లో కట్టి పడేసుకోవడం నేరం. ప్రాణాలు కాపాడి, ఆహారం పెట్టినందుకు ఓ కొంగ ముస్లిం యువకుడికి దగ్గరయ్యింది. అంతే - అది అతని పెంపుడు పక్షి కాదు. బలవంతంగా దాన్ని తన దగ్గర ఉంచుకోలేదు. విషయం క్షుణ్ణంగా పరిశీలించక, దురుద్దేశంతో కక్షపూరితంగా కేసులు పెట్టడం నేటి బిజెపి ప్రభుత్వానికి అలవాటైపోయింది.

భారత ప్రధాని అమెరికా పర్యటనకు వెళ్ళినప్పుడు "మై యుద్ధ్ కి దేశ్ సే నహీ ఆయా/ మై బుద్ధ్ కి దేశ్ సే ఆయా హూ" అని గొప్పగా చెప్పుకున్నాడు. అంటే నేను యుద్ధాలు చేసే దేశం నుండి రాలేదు. నేను బుద్ధుడు పుట్టి పెరిగిన దేశం నుండి వచ్చాను-అని అర్థం! అలా చెప్పుకోవడం బాగుంది. కానీ, నేను ముఖం నుండి మనుషులు పుట్టే దేశం నుండి వచ్చాను. భుజాల నుండి మనుషులు పుట్టే దేశం నుండి వచ్చాను-అని ఎందుకు చెప్పుకోలేదూ? వినాయకుడికి ప్లాస్టిక్ సర్జరీ జరిగిన దేశం నుండి వచ్చాను అని కదా చెప్పుకోవాలి? మరి అలా ఎందుకు చెప్పుకోలేకపోయారూ? అలా చెప్పుకుంటే, ప్రపంచ పౌరులు నవ్వుకుంటారని భయం. ఒకప్పుడు గుజరాత్‌లో ఇప్పుడు మళ్ళీ మణిపూర్‌లో నరమేధం జరుగుతూ ఉంటే దేశ ప్రధాని మౌనవ్రతం చేపట్టడమేమిటీ? దేశ ప్రజలకు భరోసా ఇచ్చి, ధైర్యం చెప్పి, సమస్యను పరిష్కరించాల్సింది ఎవరూ? గత్యంతరం లేక నిండు పార్లమెంట్‌లో విపక్ష నేత-'తమరు దేశభక్తులు కారు. దేశద్రోహులు' అని గొంతెత్తి అరవాల్సిన పరిస్థితి వచ్చింది కదా?

"డెమోక్రసీ హమారీ డిఎన్‌ఏ మై హై" అని దేశ ప్రధాని అమెరికా వైట్‌హౌస్‌లో గొంతు చించుకుని వచ్చారు. అసలు ఆయనకు డెమాక్రసీ అనే పదం ఉచ్చరించే అర్హత ఉందా? అని దేశ పౌరులు ఆలోచనలో పడ్డారు. వాస్తవాల్ని తొక్కిపెట్టి గాలి కబుర్లు చెప్పేవారిని ఈ ఆధునిక-ఆలోచనా యుగంలోని జనం విశ్వసించరు. మణిపూర్‌లో ఇద్దరు కుకీ తెగ మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఘటనపై అగ్రరాజ్యం అమెరికా ఆగ్రహించింది. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపింది. మానవ హక్కుల్ని కాపాడాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్ని కోరింది. "మణిపూర్ మె భారత్ మాతాకి హత్యా హుయీ హై" అని విపక్షనేత గొంతు చించుకుని అరిచిన అరుపు పార్లమెంట్‌లోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ప్రతిధ్వనించింది. జాతుల మధ్య, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ఓట్ల కోసం కుట్రలు చేసే పాలకులు మతాన్ని దోపుడు కర్రలుగా చేసుకుని, ప్రభుత్వాన్ని నడిపిస్తూ ఉంటే ఏమనుకోవాలీ? అదొక వికలాంగ ప్రభుత్వమనుకోవాలి! మతం వేరు-ప్రజాస్వామ్యం వేరు అని పాలకులు గ్రహించినప్పుడు కదా మళ్ళీ దేశ ఆరోగ్యం పునరుద్ధరించబడేదీ? రాహుల్ గాంధీ ఆక్రోశాన్ని పార్లమెంట్ రికార్డుల్లోంచి తొలగించుకోగలరు. కానీ, ప్రపంచ పౌరుల మనుసుల్లోంచి తొలగించలేరు.

(వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్)

★

మణిపూర్‌కు సిపిఎం ప్రతినిధి బృందం

- నేటి నుంచి మూడు రోజులపాటు పర్యటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్‌కు సిపిఎం ప్రతినిధి బృందం వెళ్లనుంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు బృందం మణిపూర్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించనుంది. బాధితులను కలుసుకోనుంది. సహాయక శిబిరాలను సందర్శించి సమస్యలు తెలుసుకోనుంది. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నేతృత్వంలో కేంద్ర కమిటీ సభ్యులు జితేంద్ర చౌదరి (సిపిఎం త్రిపుర రాష్ట్ర కమిటీ కార్యదర్శి), సుప్రకాష్ తాలుక్దార్ (సిపిఎం అస్సాం రాష్ట్ర కమిటీ కార్యదర్శి), డెబ్లీనా హెంబ్రామ్‌తో కూడిన నలుగురు సభ్యుల బృందం పర్యటించనుంది. కలహాలతో దెబ్బతిన్న ప్రాంతాలతోపాటు చురచంద్‌పూర్, మోయిరాంగ్, ఇంఫాల్‌లోని సహాయ శిబిరాలను ప్రతినిధి బృందం సందర్శించనుంది. ఇంఫాల్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నరు అనుసూయా ఉయికేని, అనేక ఇతర పౌర సమాజ సంస్థలను కూడా కలవనుంది.

స్వయంకృషి వల్లే నెహ్రూకు గుర్తింపు

- మ్యూజియం పేరు మార్పుపై రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ (ఎన్‌ఎంఎంఎల్) పేరును ప్రధాన మంత్రి మ్యూజియం అండ్ లైబ్రరీగా మార్చడంపై కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ గురువారం స్పందించారు. నెహ్రూ తాను చేసిన పనులతో ప్రజల్లో గుర్తింపు పొందారని, కేవలం ఆయన పేరుతోనే కాదని రాహుల్ వ్యాఖ్యానించారు. నెహ్రూ మెమోరియల్ మ్యూజియం పేరు మార్పుపై మోడీ సర్కారుపై విమర్శలు గుప్పించారు. నెహ్రూ వారసత్వాన్ని నాశనం చేయడం, నిరాకరించడమనే ఏకసూత్ర అజెండాతో ప్రధాని మోడీ ముందుకెళుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెహ్రూ వారసత్వంపై ప్రభుత్వ దాడి, అణచివేత కొనసాగినా జవహర్‌లాల్ నెహ్రూ ఘన వారసత్వం ఉనికిలో ఉంటుందని, రాబోయే తరాలకు నెహ్రూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని పేర్కొన్నారు.

డిఆర్‌డివో మాజీ చీఫ్ విఎస్ అరుణాచలం కన్నుమూత

- ప్రధాని సంతాపం

న్యూఢిల్లీ : భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డివో) మాజీ చీఫ్ డాక్టర్ వి.ఎస్ అరుణాచలం (87) బుధవారం కన్నుమూశారు. ఆయన అమెరికాలోని కాలిఫోర్నియాలో బుధవారం తెల్లవారుజామున నిద్రలోనే కన్నుమూసినట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు. అరుణాచలం మృతిపట్ల ప్రధాని నరేంద్రమోడీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 'అరుణాచలం మృతి శాస్త్రీయ సమాజానికి, వ్యూహాత్మక ప్రపంచానికి తీరనిలోటుని మిగిల్చింది. భారతదేశం యొక్క భద్రతా సామర్థ్యాలను బలోపేతం చేయడంలో గొప్ప సహకారాన్ని అందించారు' అని ప్రధాని తన అధికారిక 'ఎక్స్'లో పోస్టు చేశారు. విదేశాంగ శాఖామంత్రి ఎస్. జైశంకర్ తదితరులు సంతాపం తెలిపారు. 'మొదటి డిఆర్‌డిఓ శాస్త్రవేత్త వి.ఎస్. అరుణాచలం నాయకత్వానికి డిఆర్‌డివో సెల్యూట్ చేస్తోంది.' అని డిఆర్‌డివో పోస్ట్‌లో పేర్కొంది.

నలుగురిని కాల్చివేసిన ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ డిస్మిస్

ముంబయి : తన సీనియర్, మరో ముగ్గురు ప్రయాణికులను దారుణంగా కాల్చివేసిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) కానిస్టేబుల్ చేతన్ సింగ్ చౌదరిని రైల్వే విధుల నుంచి తొలగించింది. ఈ మేరకు ఆర్‌పిఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు గురువారం తెలిపారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. జులై 31 జైపూర్ -ముంబయి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో తన సీనియర్ అధికారి టికారమ్ మీనా, ముగ్గురు ప్రయాణికులను కాల్చి చంపిన సంగతి తెలిసిందే.

ఉపాధి హామీపై ఇక డ్రోన్ల నిఘా

- రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం
- ప్రత్యేకంగా ఎలాంటి నిధులు కేటాయించని వైనం
- కార్మిక సంఘాల ఆగ్రహం



న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) క్రమంగా నీరుగార్చుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పుడు పని ప్రదేశాల్లో కార్మికులపై డ్రోన్లతో నిఘా ఉంచాలని భావిస్తోంది. ఉగ్రవాదుల కదలికలు, శత్రుదేశాల సరిహద్దుల్లో అక్కడి సైనికుల కదలికల గురించి తెలుసుకోవడానికి ఉపయోగించాల్సిన డ్రోన్లను.. ఈ పథకం కింద వర్క్‌సైట్‌లలో ఉపయోగించనున్నారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకున్నది. డ్రోన్లను ఉపయోగించాలన్న నిర్ణయం తీసుకున్న మోడీ సర్కారు నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిర్ణయం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చటంలో భాగమేనని నిపుణులు, విశ్లేషకులు తెలుపుతున్నారు. అయితే, ఉపాధి హామీ పని నాణ్యతను పెంచటానికి, అక్రమాలను కట్టడి వేసే చర్యలో భాగంగానే వీటిని ఉపయోగిస్తున్నట్టు కేంద్రం సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నది.

పథకంపై ఇది సాంకేతిక జోక్యం

మంత్రిత్వ శాఖ ఇటీవల జారీ చేసిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (ఎస్‌ఒపి) ప్రకారం.. డ్రోన్‌లు నాలుగు రకాల పర్యవేక్షణ కోసం ఉపయోగించబడతాయి. అవి.. కొనసాగుతున్న పనులను సర్వే చేయడం, పూర్తయిన పనులను తనిఖీ చేయడం, ఇంపాక్ట్ అసెస్‌మెంట్, ఫిర్యాదుల విషయంలో ప్రత్యేక తనిఖీ. " ఉపాధి పనులలో అవినీతి గురించి అనేక ఫిర్యాదులు మాకు క్రమం తప్పకుండా అందుతున్నాయి. రియల్ టైమ్ మానిటరింగ్, సాక్ష్యాలను సేకరించడం కోసం డ్రోన్‌లు ప్రత్యేకంగా సహాయపడతాయి" అని డ్రోన్ల వినియోగంపై సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించటం గమనార్హం. ఉపాధి కార్మికులకు చెక్ పెట్టేందుకు ప్రవేశపెట్టిన రెండవ అతిపెద్ద సాంకేతిక జోక్యం ఇది అని కార్మిక సంఘాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఉగ్రవాదులు, శత్రుదేశాల మీద, దేశ రక్షన కోసం ఉపయోగించాల్సిన డ్రోన్లను ఉపాధి హామీ వంటి ఒక పథకంలో వినియోగించటం కార్మికులను అవమానించే చర్య అని విమర్శించాయి. ఈ ఏడాది మే 2022 నుంచి కేంద్రం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన మొబైల్ ఆధారిత అప్లికేషన్‌ని ఉపయోగించి అన్ని వర్క్‌సైట్‌ల హాజరును తప్పనిసరిగా చేసిన విషయాన్ని ఈ సందర్భంగా కార్మిక సంఘాలు గుర్తు చేశాయి. "సమర్థవంతమైన పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం కోసం, వర్చువల్‌గా పనుల ధృవీకరణ కోసం అంబుడ్స్‌పర్సన్ డ్రోన్ టెక్నాలజీ సౌకర్యాలను ఉపయోగించవచ్చని మంత్రిత్వశాఖ నిర్ణయించింది" అని ఎస్‌ఒపి పేర్కొన్నది. అంబుడ్స్‌పర్సన్‌లకు అవసరమైన విధంగా సౌకర్యాన్ని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

అదనపు నిధులు లేవు

అయితే, ఈ డ్రోన్‌లను మోహరించడానికి కేంద్రం రాష్ట్రాలకు ఎటువంటి అదనపు నిధులను అందించడం లేదు. మార్గదర్శకాల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్మినిస్ట్రేటివ్ హెడ్ నుంచి అవసరమైన నిధులను తీసుకోవలసి ఉంటుంది. ఇది రాష్ట్ర ఉపాధి బడ్జెట్‌లో దాదాపు 10 శాతం కావటం గమనార్హం. డ్రోన్‌లను కొనుగోలు చేయడం కంటే, ఈ ప్రయోజనం కోసం డ్రోన్‌లలో ప్రత్యేకత కలిగిన ఏజెన్సీలను నియమించుకోవాలని కేంద్రం.. రాష్ట్రాలను ఆదేశించింది. డేటా విశ్లేషణ, రిపోర్టింగ్ ప్రయోజనాల కోసం డ్రోన్‌ల నుంచి సేకరించిన వీడియోలు, ఫోటోలను నిల్వ చేయడానికి కేంద్రీకృత డ్యాష్‌బోర్డ్‌ను రూపొందించాలని మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది.

'ఉపాధిని దూరం చేసే చర్య'

కేంద్రంలోని మోడీ సర్కారు ఉపాధి హామీ పథకంపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని కార్మిక సంఘాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. బడ్జెట్‌లో కోతలు విధించటమే కాకుండా.. సాంకేతికత పేరుతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధిని దూరం చేసే చర్యలను బిజెపి ప్రభుత్వం తీసుకుంటున్నదని ఆరోపించాయి. ఇలాంటి నిర్ణయాలను మోడీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

దిగువ కోర్టుల్లో సాంకేతికతకు పెద్ద పీట!

- త్వరలో కాగిత రహిత కోర్టు ఏర్పాటు
- కోర్టు రికార్డుల డిజిటలైజేషన్
- సుప్రీం చీఫ్ జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ : ఇ-కోర్టుల ప్రాజెక్టు మూడవ దశకు పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయించబడిందని, దీనివల్ల న్యాయ వ్యవస్థ పనితీరులో ముఖ్యంగా దిగువ కోర్టుల్లో సాంకేతికతకు పెద్ద పీట వేయనున్నట్లు భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ పేర్కొన్నారు. దిగువ కోర్టులకు సాంకేతికంగా అవకాశాలు కల్పించాల్సిన అవసరముందని సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవె చేసిన వ్యాఖ్యలపై ప్రధాన న్యాయమూర్తి స్పందించారు. 370వ అధికరణ రద్దును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారిస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. కోవిడ్ మహమ్మారి కాలంలో ఒక హైకోర్టు వద్ద వీడియో కాన్ఫరెన్సింగ్‌కు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసేందుకు కూడా నిధులు లేని దుస్థితిలో వుందని చెప్పారు. 'ఆ సమయంలో అన్నీ మూతపడ్డాయి. కానీ మేం న్యాయస్థానాలను నిర్వహించాల్సి వుంది." అని అన్నారు. చివరకు, సుప్రీం కోర్టులోని కొన్ని లైసెన్సులను ఆ హైకోర్టుకు బదిలీ చేశామని చెప్పారు. "ఇప్పుడు మా వద్ద పెద్ద మొత్తంలో బడ్జెట్ వుంది. దిగువ కోర్టులను కూడా సాంకేతికంగా అభివృద్ధిపరిచేలా చర్యలు తీసుకోవడంపై కసరత్తు చేస్తున్నాం." అని చీఫ్ జస్టిస్ చెప్పారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇ-కోర్టుల మూడవ దశ ప్రాజెక్టుకు రూ.7 వేల కోట్లను కేటాయించారు. మొదటి రెండు దశల్లో వరుసగా రూ.639.411 కోట్లు, రూ.1670 కోట్లు కేటాయించారు. కాగిత రహిత న్యాయస్థానానికి సంబంధించి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంతోపాటు కోర్టు రికార్డులన్నింటినీ డిజిటలైజ్ చేయడం, కోర్టు ఆవరణల్లో అధునాతన ఇ సేవా కేంద్రాలను నెలకొల్పడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు చంద్రచూడ్ చెప్పారు. దేశవ్యాప్తంగా న్యాయస్థానాలన్నింటినీ అనుసంధానించాలన్నది మూడవ దశ లక్ష్యమని చెప్పారు. కరోనా సమయంలో వర్చువల్ కోర్టులు విజయవంతం కావడంతోపాటు వాటి అవసరం కూడా పెరగడంతో సమర్థవంతమైన న్యాయ క్రమాన్ని అందించడంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని భావించారు. ఆ ఆలోచనలో భాగంగానే మూడవ దశ ప్రాజెక్టుకు బడ్జెట్ మొత్తం భారీగా పెరిగింది.

సిమ్ డీలర్లకు ఇక పోలీస్ వెరిఫికేషన్ : కేంద్రం

న్యూఢిల్లీ: సైబర్ నేరాలు, మోసపూరిత ఫోన్ కాల్స్‌కు అడ్డుకట్ట వేసే పేరుతో సిమ్ కార్డులు విక్రయించే డీలర్లకు కేంద్రప్రభుత్వం మొబైల్ వెరిఫికేషన్ తప్పనిసరి చేసింది. ఎక్కువ మొత్తంలో సిమ్ కార్డు కనెక్షన్లు ఇవ్వడంపైనా ఆంక్షలు విధించినట్లు కేంద్ర టెలికాం శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం తెలిపారు. "ప్రస్తుతం కొందరు సిమ్ డీలర్లు అక్రమ మార్గాల్లో వెరిఫికేషన్ ప్రక్రియ లేకుండానే సిమ్ కార్డులను విక్రయిస్తున్నారు. ఇకనుంచి అలాంటివి ఉండవు. సిమ్ డీలర్లకు పోలీసు వెరిఫికేషన్‌ను తప్పనిసరి చేస్తున్నాం. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత వారు తమ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.10లక్షల జరిమానా విధించనున్నాం" అని కేంద్రమంత్రి వెల్లడించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 10లక్షల సిమ్ డీలర్లు ఉన్నారని, వారంతా పోలీసు వెరిఫికేషన్ పూర్తి చేసుకునేందుకు తగిన సమయం ఇవ్వనున్నట్లు తెలిపారు. బల్క్ కనెక్షన్ల నిబంధనను తొలగించి, దాని స్థానంలో బిజినెస్ కనెక్షన్ల పేరుతో కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఇందులో వ్యక్తిగత కెవైసి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ ఏడాది మే నుంచి ఇప్పటివరకు 52 లక్షల మొబైల్ కనెక్షన్లను తొలగించామని కేంద్రమంత్రి వెల్లడించారు. మోసాలకు పాల్పడుతున్న 67వేల డీలర్లను బ్లాక్ చేశామని, సిమ్ డీలర్లపై 300 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు.

ఏడేళ్ల తర్వాత సౌదీలో ఇరాన్ విదేశాంగ మంత్రి

దుబాయ్ : ఇరాన్ విదేశాంగ మంత్రి హోసెన్ అమిర్ అబ్దుల్లాహిన్ గురువారం సౌదీ అరేబియాలో పర్యటించారు. ఇరాన్ ఉన్నతస్థాయి నేత సౌదీలో పర్యటించడం గత కొన్నేళ్లలో ఇదే ప్రథమం. చైనా మధ్యవర్తిత్వంలో ఇరాన్, సౌదీలు ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఈ పర్యటన జరిగింది. తమ మధ్య గల ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి ఇరుదేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఇరాన్ నేత హోసెన్ అమిర్ అబ్దుల్లాహిన్ పర్యటన జరుగుతోంది. ఇరు దేశాలు పరస్పరం దౌత్య కార్యాలయాలను కూడా ప్రారంభించాయి. అలాగే తమ మధ్య గల శతృత్వాన్ని తగ్గించుకోవాలనే అవగాహనకు ఇరు దేశాలు వచ్చినప్పటికీ ఇరాన్ అణు కార్యక్రమంపై, యెమెన్‌లో సౌదీ నేతృత్వంలోని యుద్ధంపై ఆందోళనలు అలాగే కొనసాగుతున్నాయి. ఇరాన్ ఆందోళనకారులు సౌదీ దౌత్య కార్యాలయాలపై దాడి చేయడంతో 2016లో సౌదీ, ఇరాన్‌తో సంబంధాలు తెగతెంపులు చేసుకుంది. అంతకు కొద్ది రోజులు ముందుగానే షియా మత పెద్దను మరో 46మందితో కలిపి సౌదీ ఉరి తీసింది. ఆ చర్యను నిరసిస్తూ ఇరాన్‌వ్యాప్తంగా నిరసనలు మొదలయ్యాయి. సున్నీలు మెజారిటీగల దేశంగా సౌదీ అరేబియా వుండగా, షియా మైనారిటీలను కాపాడే దేశంగా ఇరాన్ తనను తాను భావించుకుంటుంది. అలా మతం కూడా ఆ దేశాల మధ్య చిచ్చుకు కారణమైంది.

విద్వేష ప్రసంగాలపై 'సుప్రీం'కు సిపిఎం

- ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన బృందాకరత్, కెఎం తివారీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవల ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో మతపరమైన సంఘాల నాయకులు చేసిన ద్వేషపూరిత ప్రసంగాలపై సుప్రీంకోర్టును సిపిఎం ఆశ్రయించింది. ఈ మేరకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, పార్టీ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కెఎం తివారీ పిటిషన్ దాఖలు చేశారు. షహీద్ అబ్దుల్లా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో ఇంప్లీడ్‌మెంట్ పిటిషన్ దాఖలు చేశారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ తదితర సంస్థల నాయకులు ఢిల్లీలోని నాంగ్లోయ్, ఘోండా చౌక్‌తోపాటు వివిధ ప్రదేశాల్లో జరిగిన బహిరంగ సభల్లో హిందూ మతం పేరుతో ముస్లిం సమాజంపై ప్రజలను రెచ్చగొట్టారని పిటిషన్‌లో సిపిఎం నేతలు పేర్కొన్నారు. 'హిందూ మతం పేరుతో రాజ్యాంగ విలువలు, లౌకికవాదానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టారు. దేశ రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో ఇటువంటి సమావేశాలు జరుగుతున్నాయి. ముస్లిం సమాజంపై ఆర్థిక, సామాజిక బహిష్కరణకు నిరంతర పిలుపు ఇస్తున్నాయి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. భారతీయ శిక్షాస్మృతిలోని 153ఎ, 153బి, 295ఎ, 505(1) మొదలైన అనేక సెక్షన్ల ప్రకారం ఈ ప్రసంగాలు స్పష్టంగా నేరమైనప్పటికీ, అలాంటి వారిపై పోలీసులు, పరిపాలన వ్యవస్థ కఠిన చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించిన తరువాత అలాంటి సమావేశాలు తాత్కాలికంగా ఆగాయి. విద్వేషపూరిత ప్రసంగాలకు పాల్పడే వారిపై సుమోటోగా చర్యలు తీసుకోవాలని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ ఎన్‌సిఆర్‌లోని పోలీసు అధికారులను గతేడాది అక్టోబర్‌లో ఇచ్చిన ఉత్తర్వులను ఈ పిటిషన్ ప్రస్తావించింది. 2023 ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ ఆదేశాలను అమలు చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. దేశంలోని ముస్లింలే లక్ష్యంగా భయభ్రాంతులకు గురిచేయడాన్ని ఆపడానికి కోర్టు తక్షణ జోక్యాన్ని కోరుతూ చేసిన పిటిషన్‌పై 2022 అక్టోబర్‌లో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ముస్లిములకు వ్యతిరేకంగా ద్వేషపూరిత ప్రసంగాలకు పాల్పడే వ్యక్తులపై యుఎపిఎ కింద చర్యలు తీసుకోవాలని షహీద్ అబ్దుల్లా కోరారు. ఈ నెల ప్రారంభంలో గురుగ్రామ్, నుహ్ జిల్లాల్లో మత ఘర్షణలు చెలరేగడంతో ఢిల్లీ ఎన్‌సిఆర్‌లోని కొన్ని ప్రాంతాల్లో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ర్యాలీలపై స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. హర్యానాలోని నుహ్‌లో హింసాకాండ నేపథ్యంలో ముస్లిములను బహిష్కరించాలన్న పిలుపులపై చర్య తీసుకోవాలని పది రోజుల క్రితం సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కూడా సిజెఐ డివై చంద్రచూడ్‌కు విజ్ఞప్తి చేశారు. ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన వ్యక్తులను 'గద్దర్లు' (ద్రోహులు)గా ముద్ర వేయాలని ప్రచారం చేస్తున్నారని కపిల్ సిబల్ పిటిషన్‌లో ప్రస్తావించారు. సోషల్ మీడియాలో వీడియో ఆధారంగా షహీద్ అబ్దుల్లా పిటిషన్ వేశారు. వీడియోలో హిందూ సమాజ్‌కు చెందిన సంహస్త హర్యానా హిసార్‌లో నడుచుకుంటూ పోలీసు అధికారుల సమక్షంలో నివాసితులు, దుకాణదారులకు హెచ్చరికలు జారీ చేయడం స్పష్టంగా కనిపిస్తోంది.

హిందూత్వ శక్తుల ఈశాన్య ప్రయోగశాల మణిపూర్

- ఇది దశాబ్దాల ప్రణాళిక
- జాతి ఆధిపత్యం కోసం కాషాయ మూకల దాడి

ఇంఫాల్: ఈశాన్యంలో ఆధిపత్యం కోసం హిందూత్వ జాతీయవాదం సాగించిన యుద్ధమే మణిపూర్‌లో నేటి ఆటవిక పరిస్థితికి కారణమని ఈశాన్య ప్రాంత పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసిన రచయిత అగ్నాన్ పి చటర్జీ తెలిపారు. ఇది యాదృచ్ఛికంగా జరిగిన పరిణామం కాదు, దశాబ్ద కాలంగా హిందూత్వ శక్తులు అమలు చేస్తున్న ప్రణాళిక అని ఆమె పేర్కొన్నారు. అల్ప సంఖ్యాకులైన ముస్లింలు, క్రైస్తవులు, ఆదివాసీలు, దళితులను లక్ష్యంగా చేసుకుని హిందూ జాతీయవాదులు దీనినొక ప్రయోగశాలగా మార్చుకున్నారు. నాజీల కాల్పనికత, క్రూరత్వం హిందూత్వ జాతీయవాదంగా రూపాంతరం చెందాయి. జాతి విద్వేషాలను రెచ్చగొట్టడం, హింస, దోపిడీ, దౌర్జన్యాల ద్వారా సాధించబడే సమాజమే వీటి లక్ష్యం. ఆరెస్సెస్ మూల సిద్ధాంత కర్త ఎంఎస్ గోల్వాల్కర్ నాజీలపట్ల ప్రగాఢమైన అభిమానాన్ని ప్రకటించాడు .నరేంద్ర మోడీకి స్ఫూర్తిగా నిలిచిన గోల్వాల్కర్ ఇలా పేర్కొన్నాడు. 'జాతి మరియు దాని సంస్కృతి స్వచ్ఛతను కాపాడడానికి యూదులు వంటి సెమిటిక్ జాతులనుంచి దేశాన్ని ప్రక్షాళన చేయడం ద్వారా జర్మనీ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది జాతి గర్వం అత్యధిక స్థాయిలో అక్కడ వ్యక్తమైంది. భారత దేశంలో హిందువులు కాని వారు జీవించాలంటే వారు హిందూ రాజ్యానికి అణగిమణగి ఉండాలి. ఎటువంటి హక్కులు, అధికారాలు ఉండవు, పౌర హక్కులు కూడా పొందలేరు అంటే ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉండాలి ' అని చెప్పాడు.



2019లో మోడీ ప్రభుత్వం రెండవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత పురాణ గాథల్లో పేర్కొన్న హిందువుల మాతృభూమి అఖండ భారత్ (అవిభాజ్య భారత్) సాధన గురించి మాట్లాడుతోంది. భారత దేశ వ్యాపితంగా హిందూ జాతీయవాద సమాజాన్ని రూపొందించే ప్రయోగాలు ఈశాన్యంలో ముస్లింలు, క్రైస్తవులు, ఆదివాసీలు, దళితులను టార్గెట్ చేసుకుని వారిని విచ్ఛిన్నం చేయడంపై కేంద్రీకరించాయి. 2022 నుంచి హిందూత్వ జాతీయవాదుల జాత్యహంకార ప్రసంగాలు, క్రూరమైన హింసకు అడ్డు అదుపు లేకుండా పోయింది. హిందూ జాతీయవాద నాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు, హిందూ అగ్రకులాల మౌనం, వివిధ న్యాయస్థానాలు, సంస్థలు, రాజ్యం సహకారంతో హిందూత్వ మిలీషియా గ్రూపులు ఇష్టానుసారంగా చెలరేగాయి. 2023లో ఈ క్రూరత్వం తారా స్థాయికి చేరుకుంది. మూక దాడులు, బుల్డోజర్లు, క్రూర చట్టం యుఎపిఎ కింద అక్రమ కేసులు బనాయించడం వంటివి. హర్యానా, యుపి, ఢిల్లీ, రాజస్థాన్, జార్ఖండ్, అస్సాం, కాశ్మీర్.. ఇప్పుడు మణిపూర్‌లో చూస్తున్నాం. స్వేచ్ఛను కాపాడేందుకు ఉద్దేశించిన భద్రతా చర్యలు సామాజిక జీవితాన్ని, మతాన్ని, ప్రభుత్వాన్ని సాయుధం చేసేలా ఉన్నాయి. హిందూయేతరుల వ్యాపారాలను దెబ్బతీసేలా దాడులు పెరిగాయి. గిరిజనుల భూములను లాక్కోవబడం, సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న కష్టజీవులను చొరబాటుదారులుగా, బాహ్య శత్రువులుగా చిత్రించడం వారి అస్థిత్వాన్ని, సంస్కృతిని, ఆత్మ నిర్భరతను దెబ్బతీయడం వంటి చర్యలకు పాల్పడింది.

మార్చి 27 హిందూ మెయితీలను ఎస్టీల జాబితాలో చేర్చడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించాలని మణిపూర్ హైకోర్టు ఆదేశించింది. అలా చేయడం వల్ల అట్టడుగున ఉన్న కుకీ వంటి తెగలపై అది తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది. మణిపూర్ జనాభాలో 53 శాతం మంది మెయితీలు. అందులో 83 శాతం మంది హిందువులు. వివిధ ట్రైబల్ గ్రూపుల కలయిక ద్వారా మెయితీ తెగ ఆవిర్భవించింది. మొదట్లో బ్రాహ్మణీయ క్రమంలో చేరడానికి తిరస్కరించింది. హిందూయీకరణ, కుల వివక్షకు దూరంగా ఉండేవారు. క్రైస్తవులు హిందువులను మతమార్పిడి చేస్తున్నారని హిందూత్వవాదులు తప్పుడు ప్రచారం చేశారు. మెయితీలపై దీని ప్రభావం పడింది. 1995 నాటికి మణిపూర్‌లో 650గా ఉన్న హిందూత్వ సంస్థలు 2017 నాటికి 6,000కు చేరాయి. ఇద్దరు కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించడం, వారిపై అత్యాచారానికి పాల్పడడం దీనికి పరాకాష్ట. అయితే ఇందుకు సంబంధించిన వీడియో జులై మధ్యలో ఆన్‌లైన్‌లో వైరల్ కావడం, దీనిపై అన్ని వైపుల నుంచి ఖండనలు వచ్చాయి. వెయ్యిమంది దాకా కుకీలు ఉన్న ఆ గ్రామంపై ఈ మూకలు అంతకుముందు దాడి చేసి పలువురిని హత్య చేశాయి. మెయితీ రాజకీయ నాయకులు మే 3న చోటు చేసుకున్న ఆ ఘటన ఒక మచ్చుతునక మాత్రమేనని పేర్కొనడాన్ని బట్టి చూస్తుంటే వెలుగులోకి రాని అత్యాచారాలెన్నో .. ఈ చర్యకు బాధ్యత వహించడానికి బదులు ఇది మయన్మార్ నుంచి వచ్చిన కుకీ-చిన్ తెగ వారు ఒక పథకం ప్రకారం హింస సృష్టించారని వరల్డ్ మెయితీ కౌన్సిల్ ఆరోపించింది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ మరో అడుగు ముందుకేసి ఇది నార్కో టెర్రరిజం మిలీషియా పనేనని చెప్పారు.

ఈశాన్య భారతంలో కాషాయ దండును తయారుచేసి, హిందూత్వ ఉద్యమంగా దానిని రూపుదిద్దడానికి ఆరెస్సెస్ గీచిన ప్లాన్‌నే హిందూత్వ శక్తులు ఇక్కడ అమలు చేస్తున్నాయి. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేసిన తరువాత హిందూత్వ సంస్థలు తమ కార్యకలాపాలను మరింత ఉధృతం చేశాయి. 2015లో మణిపూర్ అసెంబ్లీలో రెండు సీట్లు గెలుచుకున్న బిజెపి 2017లో ఏకంగా అధికారాన్నే చేజిక్కించుకుంది. నార్త్ ఈస్ట్ డెమొక్రటిక్ అలయెన్స్, నాగాలతో రాజకీయ పొత్తు పెట్టుకుని బలం పెంచుకునే ప్రయత్నం చేసింది. మెయితీలను హిందూ జాతీయవాదులుగా మార్చేందుకు వైష్ణవాన్ని ప్రోత్సహించింది. 2022లో బిజెపి ప్రభుత్వం చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీ, మణిపూర్ సంప్రదాయాలకు సంబంధించిన పాఠ్యాంశాలను రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఖరారు చేయరాదంటూ హుకుం జారీ చేసింది. ఇస్లామిక్ ఫోబియోను రెచ్చగొట్టేందుకు మణిపూర్‌లో ఎన్‌ఆర్‌సిని తీసుకొస్తామని చెప్పింది.

(ఫీచర్స్ అండ్ పాలిటిక్స్)

రాజ్యాంగ ఉల్లంఘనపైనే సమీక్ష

- 370వ అధికరణ రద్దుపై సుప్రీం
- 22కల్లా పిటిషనర్ల వాదనలు పూర్తయ్యే అవకాశం ?

న్యూఢిల్లీ : బిజెపి ప్రభుత్వం 2019 ఎన్నికల మేనిఫెస్టోలోనే 370వ అధికరణ రద్దు గురించి ప్రతిపాదించినందున తాజాగా ఈ అధికరణ రద్దు అనేది అధికారాలను వినియోగించుకోవడం తప్ప మరొకటి కాదని సీనియర్ న్యాయవాది దుష్యంత్ దావె గురువారం పేర్కొన్నారు. 370వ అధికరణ రద్దుపై సుప్రీం కోర్టులో గత ఏడు రోజులుగా వాదనలు కొనసాగుతున్నాయి. 370వ అధికరణ 'తన జీవిత కాల పరిమితిని పూర్తి చేసిందని', అయినా, 1957లో రాజ్యాంగ నిర్ణయాక అసెంబ్లీని రద్దు చేసిన తర్వాత 370వ అధికరణను రద్దు చేయలేరని దావె వాదించారు. ఆ వాదనపై ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ స్పందిస్తూ, రాజ్యాంగ నిర్ణయాక అసెంబ్లీ రద్దుతోనే 370వ అధికరణను రద్దు చేసే అధికారం కూడా పోయిందంటూ చేసే వాదన అసత్యమని, ఎందుకంటే 1957 తర్వాత కూడా ఆ అధికరణను ఉపయోగించే అనేక రాజ్యాంగ ఆదేశాలు జారీ చేయబడ్డాయని పేర్కొన్నారు. 370వ అధికరణను రద్దు చేసే నిర్ణయం వెనుక గల విజ్ఞతను న్యాయపరంగా సమీక్షించాలంటూ న్యాయ స్థానాన్ని గనుక ఆహ్వానించినట్లైతే ఆ న్యాయ సమీక్ష అనేది కేవలం రాజ్యాంగ ఉల్లంఘనకు మాత్రమే పరిమితం కావాలని అన్నారు. ఈ రద్దు అనేక ప్రతికూల పర్యవసానాలకు దారి తీసిందని సీనియర్ న్యాయవాది శేఖర్ నాఫడే వాదించారు. ఉదాహరణకు లోక్‌సభలో జమ్ము కాశ్మీర్‌కు తగు ప్రాతినిధ్యం లేకుండా పోయిందన్నారు. ఇది రాజ్యాంగంలోని 14వ అధికరణను ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. భారత ప్రభుత్వానికి జమ్ము కాశ్మీర్ సార్వభౌమాధికారాన్ని సంపూర్ణంగా అప్పగించడమన్నది 1947 అక్టోబరుతోనే పూర్తయిందని, అయినా రాజ్యాంగంలోని 370వ అధికరణ శాశ్వతంగా కొనసాగాలన్నది వాస్తవంగా కష్టమని సుప్రీం కోర్టు ఈ నెల 10న జరిగిన వాదోపవాదాల సందర్భంగా స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని అధికరణ 1ని పేర్కొంటూ జమ్ము కాశ్మీర్‌ను కూడా భారతదేశం తనలో కలుపుకుందని, అన్ని రకాలుగా సార్వభౌమాధికారం బదిలీ పూర్తయిందని చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం పేర్కొంది. గత వారం రోజులుగా పలు పిటిషన్లను విచారిస్తూ వచ్చిన సుప్రీం తిరిగి 22వ తేదీన విచారణను జరపనుంది. ఆ రోజుతో పిటిషనర్ల వాదనలు పూర్తి చేసే అవకాశం వుందని చంద్రచూడ్ తెలిపారు.

పోటీ చేయం

- త్రిపుర ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, తిప్రా మొత ప్రకటన
- సిపిఎంకు మద్దతుగా కాంగ్రెస్ నిర్ణయం

అగర్తల : త్రిపురలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరగనున్న ఉప ఎన్నికల్లో పోటీ చేయబోమని తిప్రా మొత, కాంగ్రెస్ ప్రకటించాయి. తమ అభ్యర్థులను నిలబెట్టడం లేదని ప్రకటించాయి. రాష్ట్రంలోని ధన్‌పూర్, బోక్సానగర్ అసెంబ్లీ స్థానాలకు సెప్టెంబరు 5న ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ రెండు స్థానాలకు సిపిఎం తన అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించింది. బిజెపి వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో ఎన్నికలకు దూరంగా ఉండాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు త్రిపుర పిసిసి అధ్యక్షులు ఆశీష్ కుమార్ సాహా గురువారం తెలిపారు. 'ఇండియా' కూటమిలోని సిపిఎం పోటీ చేస్తుండటంతో ఉప ఎన్నికల్లో పోటీ చేయకూడదని టిపిసిసి, ఢిల్లీ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అదే అభిప్రాయాన్ని తిప్రా మొత నాయకులు, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అనిమేష్ దెబ్బర్మ కూడా వెల్లడించారు. ఉప ఎన్నికల్లో తమ పార్టీ ఎవరికి మద్దతివ్వాలనే విషయంపై చర్చ జరుగుతుందని, ఈ నెల 19లోగా వైఖరి ప్రకటిస్తామని తెలిపారు.

రెండు రోజుల్లో ఇద్దరు పైలట్లు మృతి

న్యూఢిల్లీ : వరుసగా రెండు రోజుల్లో ఇద్దరు భారతీయ పైలట్లు మరణించారు. ఒక పైలట్ విమానాశ్రయంలో చనిపోగా, మరొక పైలట్ విమానంలో గుండెపోటు వల్ల మరణించాడు. ఇండిగో ఫ్లైట్ కెప్టెన్ గురువారం నాగ్‌పూర్ నుంచి పూణేకు విమానాన్ని నడపాల్సి ఉంది. బోర్డింగ్ గేట్ వద్దకు చేరుకున్న ఆయన అక్కడ స్పృహ కోల్పోయాడు. వెంటనే హాస్పిటల్‌కు తరలించగా, అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మరోవైపు ఖతార్ ఎయిర్‌వేస్‌లో పనిచేస్తున్న భారతీయ పైలట్ బుధవారం ఢిల్లీ-దోహా విమానంలో అదనపు క్రూ సిబ్బందిగా ప్రయాణించారు. గుండెపోటు రావడంతో విమానంలోనే చనిపోయారు. ఆ పైలట్ ఖతార్ ఎయిర్‌వేస్‌కు ముందు స్పైస్‌జెట్, అలయన్స్ ఎయిర్, సహారాలో పనిచేశారు. ఇద్దరు భారతీయ పైలట్ల మరణాలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ధ్రువీకరించింది.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు తొలి జాబితా ప్రకటించిన బిజెపి

న్యూఢిల్లీ: కర్ణాటక ఫలితాలతో షాక్‌లో ఉన్న బిజెపి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించింది. ఎన్నికల సంఘం ఎన్నికల తేదీలను ప్రకటించకముందే.. బిజెపి తొలి జాబితాను విడుదల చేసింది. 90 మంది ఎమ్మెల్యేలు ఉండే ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి తొలి జాబితాలో 21 మంది అభ్యర్థుల్ని ప్రకటించింది. 230 మంది ఎమ్మెల్యేలు ఉండే మధ్యప్రదేశ్ కోసం తొలి లిస్టులో 39 మందిని ఖరారు చేసింది.

మధ్యప్రదేశ్‌లో పోలీసు క్రౌర్యం

మహిళ జుట్టు పట్టి ఈడ్చుకెళ్లిన వైనం



భోపాల్ : ఓ మహిళ పట్ల పోలీసులు అత్యంత దారుణంగా ప్రవర్తించిన ఘటన బిజెపి పాలిత మధ్యప్రదేశ్‌లో జరిగింది. కట్నీ జిల్లా కౌరియాకు చెందిన చైనా బాయ్ కచి స్థలంలో ఆమెకు నష్ట పరిహారం ఇవ్వకుండానే విద్యుత్ టవర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆమె బుల్డోజర్‌ని అడ్డుకున్నారు. పోలీసులు చైనాబాయ్ కచిని జుట్టు పట్టి అక్కడి నుంచి ఈడ్చుకెళ్లారు. మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనను వీడియో తీసిన స్థానికులు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. టవర్ నిర్మాణ పనులు అడ్డుకోవడంతోనే ఆమెను అదుపులోకి తీసుకున్నామని, చట్టప్రకారమే వ్యవహరించామని సీనియర్ పోలీస్ ఆఫీసర్ మనోజ్ కేడియా చెప్పడం గమనార్హం. తనకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా నిర్మాణ పనులు చేపట్టారని చైనా బాయ్ కటి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థ, రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది ద్వారా కాంట్రాక్టర్లు తన భూమిని కబ్జా చేసేందుకు యత్నించారని అన్నారు. కలెక్టరేట్, జిల్లా పోలీస్ చీఫ్ కార్యాలయానికి వెళ్లినా, ఎవరూ తన ఫిర్యాదును పట్టించుకోవడం లేదని ఆమె తెలిపారు.

మణిపూర్ కేసుల విచారణకు 53 మందితో సిబిఐ దర్యాప్తు బృందం

ఇంఫాల్ : మణిపూర్ హింసాత్మక ఘటనలకు సంబంధించిన అన్ని కేసుల విచారణకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) గురువారం 53 మంది సభ్యులను నియమించింది. ఈ బృందంలో ముగ్గురు అధికారులు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి) స్థాయికి చెందిన వారుకాగా, వారిలో ఇద్దరు మహిళలు ఉన్నట్లు సిబిఐ అధికారి ఒకరు తెలిపారు. ఈ బృందంలో 29 మంది మహిళా అధికారులు ఉన్నట్లు సమాచారం. ఈ కమిటీలో ఎస్‌పి ర్యాంక్ అధికారిని కూడా చేర్చామని పేర్కొన్నారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అనేక కేసులను సిబిఐ విచారించనుండటంతో మహిళా సిబ్బంది రంగంలోకి దిగారు. మహిళా బాధితులకు సంబంధించిన 12 ఎఫ్ఐఆర్‌లను సిబిఐ విచారిస్తోందని, దర్యాప్తులో తేలిన కేసులను కూడా మరోసారి సిబిఐ విచారిస్తుందని కేంద్రం సుప్రీంకోర్టుకు వివరించిన సంగతి తెలిసిందే.

తీస్తాకు అనుమతి నిరాకరణ : ఐఐఎస్‌సి నిర్వాకం

బెంగళూరు : నగరంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి)లో 'మత సామరస్యం-న్యాయం' అనే అంశంపై ప్రసంగించేందుకు వెళుతున్న పౌర హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్‌ను బుధవారం సంస్థ భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఐఐఎస్‌సిలోని ఆడిటోరియంలో ఓ విద్యార్థి సంఘం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, కొద్ది గంటల ముందు అనుమతి నిరాకరించారు. అధ్యాపకుల జోక్యంతో తీస్తా ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. చివరికి క్యాంపస్‌లోని ఓ క్యాంటీన్ వెలుపల జరపాల్సి వచ్చింది. విద్యార్థులను ఉద్దేశించి తీస్తా, నలుగురు అధ్యాపకులు ప్రసంగించారు.




మీకోసం

పన్నీరు తయారు చేసేటప్పుడు వచ్చే నీళ్లను పారబోయకుండా, వాటితో అన్నం వండుకుంటే ఆరోగ్యానికి మంచిది.

జీవన సౌరభం

చదవడం అనేది కేవలం కుతూహలానికి, మానసిక ఆనందానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజాన్ని మార్చడానికి ఉపయోగపడాలి.


మంచి పని



ప్రమోద్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఒక రోజు రెండు మామిడి మొక్కల నాటు అంట్లను తీసుకునివచ్చి ఇంట్లో పెట్టాడు. 'బడి నుంచి వస్తున్నప్పుడు దారిలో రోడ్డుపక్కన పడి ఉండటం చూసి తెచ్చాను నాన్నా' అని తండ్రికి చెప్పాడు. 'మనకు పెరడు లేదుగా ఎక్కడ నాటుతావు' అని తండ్రి అడిగాడు. 'మా బడిలో నాటుతాను నాన్నా.. ఇలాంటి వాటికి మా హెడ్ మాస్టర్ గారు సంతోషంతో అంగీకరిస్తారు' అన్నాడు ప్రమోద్. అయితే ఆ రోజు ఉదయాన మామిడి మొక్కలు అలాగే ఉంచి బడికి వెళుతున్న కొడుకును చూసి 'ప్రమోద్ ఆ మొక్కలు మరచిపోయినట్లున్నావ్ అన్నాడు' నాన్న. 'మొక్క నాటడానికి మంచి పోషకమైన మట్టి కావాలంట. మా బడికి కొద్ది దూరంలో వున్న దానయ్య వీధిలో ఉందని మా ఫ్రెండ్ చెప్పాడు. మట్టికోసం గోనె సంచి కూడా తీసుకొన్నాను' అని చెబుతూ సైకిల్‌పై వెళ్ళాడు ప్రమోద్. మరుసటి రోజు మామిడి మొక్కలు అలాగే వుంచి వెళుతూ 'నాన్నా ఈ రోజు మట్టి తీసుకెళ్తాను. రేపు ఆ చెట్లు నాటుతాను' అన్నాడు. 'అదేంటి నిన్న ఉదయం తీసుకెళ్లిన మట్టి చాల లేదా' అని నాన్న అడిగాడు. అప్పుడు. 'నిన్న ఉదయం మట్టి తీసుకెళ్తున్నప్పుడు అనుకోకుండా రోడ్డు మధ్యలో ఉన్న గుంతపై సైకిల్ పోవడం వలన నా స్నేహితుడు కింద పడ్డాడు. నాకు చాలా బాధేసింది. అందుకే నా దగ్గర ఉన్న మట్టిని ఆ గుంతను పూడ్చడానికి ఉపయోగించాను. ఈ రోజు తెచ్చే మట్టితో మొక్క నాటుతాను' అని చెప్పాడు ప్రమోద్. కొడుకు వంక సంతోషంగా చూస్తూ.. కొడుకు మంచి మనసుకు మనసులోనే తెగ మురిసిపోయేడు నాన్న.

- ఓట్ర ప్రకాష్ రావు
09787446026

4+2 = □ S
5+7 = □ E
11-6 = □ A
9-7 = □ T
1+3 = □ R
6+9 = □ W
7 - 4 = □ Y
6+3 = □ B



6	2	4	5	15	9	12	4	4	3

తమాషా చూడండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను కలిపి పక్కనే ఉన్న గడిలో రాయండి. చివర ఇచ్చిన అంకెల ప్రకారం పైన ఉన్న అక్షరాలను సరైన క్రమంలో రాసి తమాషా చూడండి..

నేను గీసిన బొమ్మ



కె. కుముద,
3వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రోగ నిరోధక శక్తి లోపంతోనే 'ఆస్తమా'



ప్రపంచవ్యాప్తంగా పిల్లల నుంచి పెద్దల వరకూ ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యల్లో ఆస్తమా (ఉబ్బసం) వ్యాధి ఒకటి. ఇది శ్వాస సంబంధ వ్యాధి ఇది. దీనివల్ల ఊపిరితిత్తుల్లో వాపు వల్ల వాయు మార్గాలు కుంచించుకు పోతాయి. శ్వాసకు అడ్డంకులు ఏర్పడి రోగి సరిగ్గా గాలి తీసుకోలేక ఇబ్బందిపడతాడు. ఈ వ్యాధిగ్రస్తులను ఆయాసం, దగ్గు బాగా ఇబ్బంది పెడతాయి. వర్షాకాలం, శీతాకాలంలో అస్తమా రోగులకు సమస్యలు మరింతగా పెరుగుతాయి. ఈ రెండు కాలాల్లో సూర్యరశ్మి తక్కువగా ఉండటంతో విటమిన్-డి తగ్గిపోతుంది. రోగ నిరోధక శక్తి మరింత పడిపోయి ఆస్తమా తీవ్రరూపం దాల్చుతుంది. పుట్టిన పిల్లల దగ్గర నుంచి 30-35 సంవత్సరాల పెద్దవారిలో కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. చిన్న పిల్లల్లో పుట్టినప్పటి నుంచి ఈ వ్యాధి ఉంటే దానిని 'చైల్డ్‌హుడ్ ఆన్సెట్ ఆస్తమా' అంటారు. 20 సంవత్సరాల పైబడి ఉన్న వారిలో వస్తే దానిని 'అడల్ట్ ఆన్సెట్' ఆస్తమా అంటారు.

వంశ పారంపర్యం, వాతావరణ కాలుష్యం, దీర్ఘకాలిక జలుబు, సైనస్ ఇన్‌ఫెక్షన్స్, దుమ్ము, ధూళి, బూజు, పెంపుడు జంతువుల వెంట్రుకలు, ఆహార పదార్థాల్లోని రసాయనాల వంటి వల్ల ఆస్తమా వస్తుంది. చర్మ వ్యాధులు ఉన్న చిన్నారులకు వచ్చే అవకాశాలు ఎక్కువ. తల్లిదండ్రులు ఆస్తమా బాధితులైతే పిల్లలకు కూడా వచ్చే అవకాశం ఉంది. జలుబు లాంటి వైరల్ ఇన్ఫెక్షన్లతో కూడా రావచ్చు. వాయు కాలుష్యం, సిగరెట్ పొగ, సెంటు వాసనలు, దుమ్ము, ధూళితో కూడా సంభవిస్తుంది. యాస్పిరిన్ వంటి నొప్పి తగ్గించే ఔషధాలు, బీపీ నియంత్రణకు వాడే కొన్ని మందులతో కూడా వచ్చే అవకాశం ఉంది. అజీర్తి, గ్యాస్ ట్రబుల్, మానసిక ఒత్తిళ్ల తదితర వాటితో వచ్చే ప్రమాదం ఉంది.

వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన ఆహారాలు

పాలకూర: మెగ్నీషియానికి పాలకూర మంచి ఆధారం. ఆస్తమా లక్షణాలను తగ్గించడంలో ఇది బాగా సహకరిస్తుంది.



రెడ్ క్యాప్సికం: దీనిలో 'సి' విటమిన్ (ఎస్కార్బిక్ యాసిడ్) ఎక్కువగా ఉంటుంది. ఎర్ర మిరపకాయలోని ఎస్కార్బిక్ యాసిడ్ 'ఫాస్ఫోడిల్ స్టెరేజ్' అనే ఎంజైమ్ ఉత్పత్తిని అడ్డుకొని ఆస్తమాను నివారించడంలో ఉపయోగపడుతుంది.

ఉల్లి: వీటిలో కూడా యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ అస్మాటిక్ ప్రభావాలున్నాయి.

ఆరెంజ్: కమలా, నారింజ, నిమ్మలలో ఉండే విటమిన్ 'సి' ఆస్తమా లక్షణాలు తగ్గిస్తుంది.

యాపిల్: యాపిల్‌లో ఉండే 'ఫైటోకెమికల్స్', యాపిల్ తొక్కలో ఉండే 'లైకోఫిన్' వంటివి అస్తమాతో ఇబ్బంది పడే వారి ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తాయి.

వ్యాధి లక్షణాలు ఇవే...

- ఛాతీ బిగుసుకుపోయినట్లు ఉండడం-శ్వాసలో ఇబ్బంది రావడం
- ఆయాసం రావడం
- విపరీతమైన దగ్గుతో బాధపడడం
- ఉదయం, రాత్రి వేళల్లో దగ్గు తీవ్రత పెరగడం
- విపరీతంగా గురక పెట్టడం
- ఊబకాయంతో ఇబ్బంది పడడం
- గొంతులో ఈల వేసినట్టుగా శబ్దం రావడం

నివారణా పద్ధతులు

ఇన్‌హెలేషన్ థెరపీ : ఇన్‌హెలేషన్ థెరపీ అనేది ఆస్తమా వ్యాధికి ప్రపంచ వ్యాప్తంగా ఆమోదం పొందిన అత్యుత్తమ చికిత్సా విధానం. దీనివల్ల నేరుగా మందు వాయు మార్గం నుంచి ఊపిరితిత్తుల్లోకి వెళ్లి తక్షణం పనిచేస్తుంది. ఇందులో 'రిలీవర్స్' తాత్కాలిక ఉపశమనం కలిగించేవి. 'ప్రివెంటర్స్' దీర్ఘకాలం వ్యాధిని అదుపులో ఉంచేవి. ఇతర ఔషధాలతో పోల్చితే ఈ ఇన్ హేలర్ల ద్వారా ఇచ్చే ఔషధాలు చాలా తక్కువ డోసేజీని కలిగి ఉంటాయి. నిరభ్యంతరంగా ఈ విధానాన్ని ఎంచుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతుంటారు.

మందుల వాడకం ద్వారా : మాత్రల ద్వారా గనుక మందులను తీసుకుంటే అవి మొదట రక్తంలోకి వెళ్లి తరువాత ఊపిరితిత్తులను చేరుకుని పనిచేస్తాయి. అందుకు కొంత ఎక్కువ సమయం పడుతుంది.

ఇంజక్షన్ ద్వారా వైద్యం : సిరప్‌లు, ఇంజక్షన్ల ద్వారా తీసుకునే మందు మొదట రక్తంలో కలిసి చివరగా లంగ్స్‌పై ప్రభావాన్ని చూపుతాయి. ఈ మందులు రక్తంలో కలవడం వల్ల శరీరంలోని ఇతర భాగాలకు చేరిపోయి దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది.

రోగ నిరోధక శక్తితో నియంత్రణ

ఆస్తమా అనేది అలెర్జిక్ వ్యాధి. ఇది ఊపిరితిత్తులలో అలర్జీగా భావించొచ్చు. ఏదైనా అలర్జెట్ (దుమ్మూ, ధూళి, చల్లగాలి, శరీరానికి సరిపడని తినుబండారాలు, ఒత్తిడి) కారణం కావొచ్చు. దగ్గు, ఆయాసం, పిల్లికూతలు వంటివి ఆస్తమా వ్యాధి లక్షణాలు. ఆస్తమా నిర్ధారణకు పిఇఎఫ్ఆర్ రీడింగులు, పిఎఫ్‌టి (ఊపిరితిత్తుల బలపరీక్ష) చేస్తారు. ముఖ్యంగా ఇన్‌హేలర్స్ ద్వారా ఆస్తమా నుంచి ఉపశమనం పొందొచ్చు. ఇన్‌హేలర్లు డైరెక్ట్‌గా ఊపిరితిత్తులపై త్వరగా ప్రభావాన్ని చూపుతాయి. తక్కువ సైడ్ ఎఫెక్ట్స్ కలిగి ఉంటాయి. ఆస్తమాను మనం ఇన్‌హేలర్ల సహాయంతో పూర్తిగా నియంత్రించుకోవచ్చు. అలర్జీని గుర్తించి ఒత్తిడులకు దూరంగా ఉంచటం ద్వారా శరీరానికి ఇన్‌హేలర్లు అలవాటు చేయటం ద్వారా అదుపులో ఉంచుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా 18 శాతం మందికి ఉబ్బసం (ఆస్తమా) ఉన్నట్టు అంచనా. అయితే ఉబ్బసం వ్యాధి వస్తే తగ్గదనే భయం ఒకరిదైతే.. పిల్లలు పెద్దవాళ్లయితే అదే తగ్గుతుందిలే అన్న నిర్లక్ష్యం మరొకరిది. ఇలాంటి అపోహలు అనేకం ఉన్నాయి. ఇది ఇన్‌ఫెక్షన్ కాదు. రోగనిరోధక వ్యవస్థలోని గందరగోళ పరిస్థితి వల్ల వచ్చే అలర్జీ. అయితే దీనికి జన్యుపరమైన కారణాలున్నాయి. సాధారణంగా 95 శాతం సందర్భాల్లో 'ఫ్యామిలీ హిస్టరీ' ఉంటుంది. తల్లిదండ్రులు ఇద్దరిలో ఒకరికే ఆస్తమా ఉంటే, పిల్లలకు వచ్చే ఆస్కారం 25 శాతం. ఇద్దరికీ ఉంటే మాత్రం 50 శాతం మేర ప్రమాదం పొంచి ఉన్నట్టే. తొలి దశలోనే నిపుణుల్ని సంప్రదిస్తే మంచిది.




- డాక్టర్ నల్లా దుర్గాప్రసాద్
ఊపిరితిత్తులు, సుగర్‌వ్యాధి నిపుణులు
పార్వతీపురం, విజయనగరం జిల్లా,
ఫోన్ : 77999 46111

పెళ్లి కూడా సింపుల్‌గానే ...



'లావణ్య నాకు ఐదేళ్లుగా పరిచయం. నాకు చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారు.. అందులో లావణ్య ఒకరు. చాలాకాలం ఫ్రెండ్స్ గానే ఉన్నాం. ఒకరిని ఒకరు అర్థం చేసుకున్నాం.. ఇక ఈ బంధాన్ని మరో అడుగు ముందుకు తీసుకెళ్లాలి అని నిర్ణయించు కున్నాం. ముందు నేనే.. లావణ్యకు ప్రపోజ్ చేశా. ఆ తరువాత ఇంట్లో చెప్పాం. వారు ఒప్పుకోవడంతో నిశ్చితార్థం వరకు వెళ్లిపోయాం. లావణ్య చాలా కేరింగ్ పర్సన్. నాకు ఎన్నో గిఫ్ట్స్ ఇస్తుంది. ఇప్పుడు నేను వాడుతున్న ఫోన్ కూడా ఆ గిఫ్ట్స్‌లో ఒకటి. నాకు ఏది ఇష్టం అనేది ఆమెకు తెలుసు.. చాలా మెచ్యూర్డ్‌గా ఆలోచిస్తుంది. నాకు సోషల్ మీడియాలో అన్నీ పంచుకోవాలని ఉండదు. అందుకే చాలా రేర్‌గా కనిపిస్తా.. నా నిశ్చితార్థం లానే పెళ్లి కూడా చాలా సింపుల్‌గా చేసుకుంటాం' అని వరుణ్ తేజ్ వివరించారు. వరుణ్ తేజ్ ప్రస్తుతం 'గాండీవధారి అర్జున' అనే సినిమాలో నటిస్తున్నారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్ కార్యక్రమాలు వేగవంతం చేసింది. ఈ ప్రమోషన్స్‌లో భాగంగా వరుణ్ తేజ్ పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో పై విషయాలు ముచ్చటించారు.




'లవ్ గురు' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

విజయ్ ఆంటోనీ తెలుగులో నటిస్తున్న తాజా చిత్రం 'లవ్ గురు'. మృణాళినీ రవి హీరోయిన్‌గా నటిస్తున్నారు. వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహిస్తున్నారు. లవ్ గురు సినిమాను తన బ్యానర్ గుడ్ డెవిల్‌లో విజయ్ ఆంటోనీ నిర్మిస్తున్నారు. ఇవాళ సోషల్ మీడియా ద్వారా లవ్ గురు సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు హీరో విజయ్ ఆంటోనీ. ప్రస్తుతం రెగ్యులర్ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవి విడుదల చేయనున్నట్లుగా సమాచారం.

జవాన్ ప్రమోషన్‌లో నయన్

బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్, నయనతార నటిస్తున్న చిత్రం 'జవాన్'. నయనతార తన సినిమాల ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటారని తెలిసిందే. డైరెక్టర్ అట్లీ ఈ సినిమా తీస్తున్నారు. అయితే ఇన్నాళ్ల కెరీర్‌లో జవాన్ కోసం ప్రమోషన్స్ బాట పట్టాలని నిర్ణయించుకుందట నయన్.





'భ్రమయుగం' షూటింగ్ ప్రారంభం

నైట్ షిఫ్ట్ స్టూడియోస్ నిర్మిస్తున్న మొదటి చిత్రం 'భ్రమయుగం'లో ప్రముఖ నటుడు మమ్ముట్టి నటిస్తున్నారు. రాహుల్ సదాశివన్ రచన-దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా మమ్ముట్టి మాట్లాడుతూ ఎన్ఎస్1 ఒక ఉత్తేజకరమైన చిత్రం. నేను మునుపెన్నడూ పోషించని పాత్రను పోషిస్తున్నందున ఈ చిత్రం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. దర్శకుడు రాహుల్ అద్భుత ప్రతిభ, నిర్మాతలు రామ్-శశిల అభిరుచి ఈ చిత్రాన్ని మరింత ప్రత్యేకం చేశాయి." అన్నారు.

గోదావరి టైటాన్స్ విజయం

ఎపిఎల్ సీజన్-2



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం)

విశాఖ పిఎం పాలెం సమీపంలోని ఎసిఎ-విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం జరిగిన మొదటి మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్, గోదావరి టైటాన్స్ జట్లు తలపడ్డాయి. 56 పరుగులతో గోదావరి టైటాన్స్ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. తొలుత టాస్ గెలుచుకున్న వైజాగ్ వారియర్స్ ఫీల్డింగ్ ఎంచుకుని బరిలోకి దిగారు. గోదావరి టైటాన్స్ బ్యాట్స్‌మ్యాన్లు చెలరేగిపోయారు. 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 191 పరుగులు సాధించారు. ఓపెనర్‌గా దిగిన కెప్టెన్ సిఆర్ జ్ఞానేశ్వర్ 53 బంతులలో ఆరు సిక్స్‌లు, మూడు ఫోర్లతో 80 పరుగులు చేశారు. వై సందీప్ 38 బంతుల్లో మూడు సిక్స్‌లు, ఐదు ఫోర్లతో 63 పరుగులు చేశారు. వీరిద్దరూ అర్థ సెంచరీలు పూర్తిచేయడమే కాకుండా 91 బంతుల్లో 144 పరుగులు చేసి బలమైన పార్ట్‌నర్‌షిప్‌ను నెలకొల్పారు. 192 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన వైజాగ్ వారియర్స్ క్రీడాకారులు 17 ఓవర్లలో 135 పరుగులు మాత్రమే చేసి ఆలౌటయ్యారు. వైజాగ్ వారియర్స్ కెప్టెన్ కె అశ్విన్ హెబ్బార్ 19 బంతుల్లో 36 పరుగులు చేశారు. బౌలింగ్‌లోనూ గోదావరి టైటాన్స్ అదరగొట్టారు. ఆ జట్టు బౌలర్ ఎస్‌కె ఇస్మాయిల్ మూడు ఓవర్లలో 13 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీశారు. కెవి శశికాంత్ మూడు ఓవర్లలో 11 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు, టి విజయ్ నాలుగు ఓవర్లలో 19 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు. గోదావరి టైటాన్స్ కెప్టెన్ జ్ఞానేశ్వర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

అందరి దృష్టి బుమ్రా పైనే..

- జితేశ్ ఇన్.. సంజు ఔట్..
- రింకూ అరంగేట్రం పక్కా..
- నేడు ఐర్లాండ్‌తో తొలి టి20
- రాత్రి 7.30గం॥ల నుంచి

డబ్లిన్: భారత యువ క్రికెటర్ల జట్టు డబ్లిన్ వేదికగా జరిగే తొలి టి20 ఐర్లాండ్‌తో తొలి పరీక్షకను ఎదుర్కోనుంది. జస్ప్రీత్ బుమ్రా ఏడాది న్నర తర్వాత మళ్లీ బంతిని అందుకోనున్నాడు. ఈ సిరీస్ తర్వాత రెండు మెగా టోర్నీలున్న దృష్ట్యా టీమిండియా కీలక ఆటగాళ్లు లేకుండా ఈ సిరీస్‌కు పయనమైంది. వికెట్ కీపర్ సంజు శాంసన్ స్థానంలో జితేశ్ శర్మ టి20ల్లో అరంగేట్రం చేయనున్నాడు. ఐపిఎల్ రాణించిన రింకూ సింగ్‌తోపాటు వెస్టిండీస్ పర్యటనలో రాణించిన తిలక్ వర్మలకు తుది జట్టులో చోటు దక్కడం ఖాయం. ఈ సిరీస్ ముగిసిన తర్వాత బెంగళూరులో శిక్షణా శిబిరంలో ఆటగాళ్ల ఫిట్‌నెస్ పరీక్షించి ఆసియాకప్‌కు జట్టును ప్రకటించనున్నారు. ఈ మ్యాచ్‌లు స్పోర్ట్స్-18 చానెల్‌తో పాటు జియో సినిమా యాప్‌లో వీక్షించవచ్చు. ఈ సిరీస్‌కు రుతురాజ్ గైక్వాడ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

భారతజట్టు(అంచనా): బుమ్రా(కెప్టెన్), గైక్వాడ్, జైస్వాల్, జితేశ్ శర్మ(వికెట్‌కీపర్), తిలక్ వర్మ, రింకూ సింగ్, దూబే, సుందర్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, బిష్ణోయ్.

రికర్వు జట్లకు కాంస్యాలు

పారిస్: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-4లో భారత పురుషుల, మహిళల రికర్వు జట్లకు కాంస్య పతకాలు దక్కాయి. గురువారం జరిగిన కాంస్య పతక పోటీలో ధీరజ్ బొమ్మిదేవర, అతాను దాస్, తుషార్ షెల్కేలతో కూడిన పురుషుల రికర్వు జట్టు 6-2(54-56, 57-55, 56-54, 57-55)తో స్పెయిన్‌కు చెందిన ఆండ్రెస్, యున్ సాంఛెజ్, పబ్లో అచ్చాలను ఓడించారు. ఇక అంకిత భగత్, భజన్ కౌర్, సిమ్రన్‌జీత్ కౌర్‌లతో కూడిన మహిళల జట్టు 5-4 (52-55, 52-53, 55-52, 54-52) (27-25)తో షూట్-ఆఫ్‌లో మెక్సికోను చిత్తుచేసి పతకాన్ని ఖాయం చేసుకుంది. ఈ టోర్నీలో 2వ సీడ్‌గా బరిలోకి దిగిన పురుషుల, మహిళల రికర్వు జట్లు సెమీస్‌లో చైనీస్ తైపీ చేతిలోనే ఓటమి పాలయ్యాయి.

ప్రపంచ అథ్లెటిక్స్ ఉపాధ్యక్షునిగా సుమరివల్లా



లండన్: భారత అథ్లెటిక్స్ సమాఖ్య అధ్యక్షులు అదిల్లే సుమరివల్లా(65)కు అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ అథ్లెటిక్స్ ఎక్జిక్యూటివ్ బోర్డు ఉపాధ్యక్షునిగాఎన్నికయ్యారు. దాంతో, ఈ పదవిని అలంకరించిన తొలి భారతీయుని సుమరివల్లా గుర్తింపు పొందారు. ప్రపంచ అథ్లెటిక్స్ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించిన మూడో వ్యక్తిగా నిలిచాడు. ప్రపంచ అథ్లెటిక్స్ ఎక్జిక్యూటివ్ బోర్డులో అధ్యక్షుడు, నలుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు అపాయింటెడ్ సభ్యులు, ఒక నాన్ ఓటింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఉంటారు. నాలుగేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68